@vaartanews @mvnewstv www.mivaartanews.com
IN MEDIA PUBLICATION PVT LTD
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
TGBIL/25/A0512
ఆదివారం
25 అక్టోబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS
సంపుటి : 02
సంచిక :112
పేజీలు : 12 వెల : 5/-
PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

# మీ పెట్టుబడులు రెట్టింపు చేయండి

- పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- మీకు నేను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా
- రక్షణ రంగానికి తెలంగాణ సురక్షితం
- దేశం ఆయుధాలను దిగుమతి చేసుకునే స్థితి నుంచి సూపర్ పవర్‌గా ఎదగాలి
- అదే మా ఆశయం.. మీ పెట్టుబడులకు నాది పూచీ...
- మీకు ఏమి కావాలో చెప్పండి..



హైదరాబాద్

'రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే మీకు నేను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా. మీకు ఏమి కావాలో చెప్పండి చేయడానికి రెడీ. మీ పెట్టుబడులు రెండింతలు చేయండి. దేశం ఆయుధాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఆయుధ రంగంలో సూపర్ పవర్‌గా ఎదగాలి. రక్షణ రంగంలో ప్రపంచస్థాయిలో అగ్రగామిగా భారత్‌ను చూడాలన్నది నా ఆకాంక్ష. యుద్ధానికి అవసరమైన సాంకేతికతను దిగుమతి చేసుకునేస్థాయి నుంచి రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలి. యుద్ధం కోసమే కాకుండా, శాంతిని కాపాడేందుకు కూడా ఆయుధాలు అవసరం. - మిగతా 10లో



## క్రిప్టో ఆస్తులు, ఏఐపై ప్రత్యేక దృష్టి

- 46 ఆర్థిక అంశాలపై పార్లమెంటరీ కమిటీ అధ్యయనం
- 2026-27 ఆర్థిక సంవత్సరానికి కీలక అంశాలను ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం ఎంపిక
- క్రిప్టో, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రత్యేకంగా పరిశీలనచనుంది



## రైతుల కష్టాలకు బీఆర్ఎస్ నేతలే కారణం

- బరాజ్‌లను మళ్లీ హరీశ్‌కు అప్పగించాలా?
- ఆయన మంత్రిగా ఉన్నప్పుడు కట్టిన మేడిగడ్డ కుంగిపోయింది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫైర్
- ప్రాణహిత--చేవెళ్ల కట్టి ఉంటే ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అయ్యేదని వ్యాఖ్య

హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లను తనకు అప్పగిస్తే 6 నెలల్లో పునరుద్ధరించి ఇస్తానని చెప్పడానికి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు సిగ్గుండాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. నీటిపారుదల శాఖ మంత్రి పదవి నుంచి హరీశ్‌రావును గతంలో కేసీఆర్ పీకేశారని.. ఆయన ఆ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కట్టిన మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ మళ్లీ బరాజ్‌లను - మిగతా 3లో



## మోదీ ఫొటోకు క్షుద్రపూజలు!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- ప్రధాని మోదీ ఫొటోకు క్షుద్రపూజలు చేసిన వీడియో ఆన్‌లైన్‌లో హల్‌చల్
- దీనితో ఉత్తరప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



## ఫ్రాన్స్ నిరసనల్లో అరాచకం.. దుకాణాల లూటీ

- ఫ్రాన్స్‌లో అల్లర్ల నేపథ్యంలో వేల సంఖ్యలో దుకాణాల దోపిడీ
- దోచుకున్న లగ్జరీ వస్తువులు ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో ప్రత్యక్షం
- అమెజాన్, వింటెడ్ వంటి సంస్థలతో ప్రభుత్వం అత్యవసర సమావేశం
- అక్రమ అమ్మకాలను అడ్డుకోవాలని టెక్ కంపెనీలకు కఠిన ఆదేశాలు
- దొంగసొత్తు అమ్మితే కఠిన శిక్షలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిక

# కేంద్ర నిధులపై సర్కార్ ఫోకస్



- అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు
- కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష
- నిధుల రికవరీ, వినియోగం వేగవంతం చేయాలని ఆదేశం
- కేంద్ర అధికారులతో సమన్వయం పెంచుకోవాలని సూచన
- అవసరమైతే కేంద్ర కార్యదర్శులతో తానే చర్చిస్తానని వెల్లడి
- హైదరాబాద్ సచివాలయంలో

హైదరాబాద్

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల వినియోగాన్ని సీఎస్ సమీక్షించారు. లభ్యతలో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వాడుకోవడంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. - మిగతా 10లో

## రాహుల్ ఓట్ చోరీ ర్యాలీ సిక్కుల గాయాలపై కారం చల్లడమే

- కాంగ్రెస్ అగ్రనేతపై బీజేపీ ఫైర్
- నవంబర్ 1న ర్యాలీ నిర్వహణపై ఇండి కూటమిలోని పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేదు
- బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్
- ఎవరు చెప్పినా వినకుండా రాహుల్ తన పంతం నెగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు





## ఢిల్లీలో అత్యుత్తమ గాలి నాణ్యత నమోదు

- దశాబ్ద కాలంలో ఇదే బెస్ట్!
- అక్టోబర్ 24న 191గా నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- ప్రభుత్వ నిరంతర చర్యల వల్లే ఇది సాధ్యమైందన్న ఢిల్లీ పర్యావరణ మంత్రి
- గత 24 గంటల్లో వేలాది వాహనాలకు చలాన్లు, వ్యర్థాల తొలగింపు
- కాలుష్య నియంత్రణను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తాం

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తాం

- న్యాయపరమైన చిక్కులు లేకుండా నివాసయోగ్యమైన ప్రాంతంలో స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ
- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ - మిగతా 10లో



## వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను

- బంగాళాఖాతంలో వాయుగుండం.. అతి తీవ్ర తుపానుగా మారే సూచన
- అక్టోబర్ 28న ఏపీ తీరాన్ని తాకవచ్చని అంచనా
- బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 115-125 కి.మీ వేగంతో గాలులు
- ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ

# సంపాదకీయం

## దేశాల నమ్మకం కోల్పోతున్న ఐరాస

రెండవ ప్రపంచయుద్ధం నేర్పిన గుణపాఠాలను పునాదులుగా చేసుకొని 1945 జూన్ 26న 51 దేశాలు తీసుకున్న నిర్ణయంతో 1945 అక్టోబర్ 24న ఐక్యరాజ్యసమితి (ఐరాస) అనివార్యంగా ఏర్పడింది. 'యునైటెడ్ నేషన్స్' అనే పదాన్ని అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ రూపొందించారు. అమెరికాలోని న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా ప్రారంభమైన ఐరాసలో నేడు 193 (రెండు పరిశీలన దేశాలుగా ఉండగా) దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. స్వతంత్ర దేశాలుగా గుర్తింపు పొందని నార్త్ సైప్రస్, సొమాలిల్యాండ్ అబ్కాజియా లాంటి రాజ్యాలకు ఐరాస సభ్యత్వం ఇవ్వలేదు. వాటికన్ సిటీ, పాలస్తీనా సభ్యత్వాన్ని పొందలేదు. గత 80 ఏండ్లుగా ప్రపంచ దేశాల మధ్య విభేదాలను పరిష్కరించే తటస్థ వేదిక రూపంలో మధ్యవర్తిత్వం వహిస్తూ, పలు వివాదాల పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తూ, కరోనా లాంటి విపత్తు జరిగినపుడు ప్రజలను చైతన్య పరిచే ఐక్యరాజ్యసమితి ఎనిమిది దశాబ్దాల వ్యవస్థాపక వేడుకలు చేసుకుని శతాబ్ది ఉత్సవాల స్థాయికి ఎదగడానికి ఉవ్విళ్లూరుతూ మానవళికి సేవలు అందించడం సంతోషదాయకం. అయితే ఇటీవలి కాలంలో క్రమంగా ప్రపంచ ప్రజల ఐరాస విశ్వాసం కోల్పోతున్నది. ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం ప్రకారం ఏటా అక్టోబర్ 24న సభ్యదేశాలు ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ ఉంటాయి. ఈ ఏడాది ఐరాస దినోత్సవం సందర్భంగా అందరికీ నమ్మకంతో కూడిన సకారాత్మక మార్పులను తీసుకురావడం అనే అంశాన్ని ఐరాస సర్వసభ్య సమావేశం ఇతివృత్తంగా నిర్ణయించింది. ప్రపం చ మానవాళిని విపత్తులు, భీకర యుద్ధాలు, వాతావరణ ప్రతికూల మార్పులు కల్లోల పరుస్తున్న వేళ, దేశాలన్నీ ఆర్థిక, సామాజిక, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న అకాలంలో ఐరాస 81వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకోవలసి వస్తున్నది. అత్యవసర సమయాల్లో సత్వరమే స్పందిస్తూ, ప్రపంచ దేశాలకు తగిన పరిష్కారాలను సూచిస్తూ, ప్రపంచశాంతి స్థాపన యజ్ఞంలో తన వంతు బాధ్యతలను నిర్వహిస్తున్న ఐరాస ప్రశంసలు అందుకుంటున్నది. కానీ ప్రస్తుతం కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్ -- పాలస్తీనా, అమెరికా -- ఇరాన్ యుద్ధాలకు మధ్యవర్తిత్వానికి దూరంగా ఉంటూ, వాటిని అదుపు చేయడంలో విఫలం కావడంతో నేడు ఐరాస పేపర్ టైగర్‌గా కనిపిస్తున్నదని, సంస్థ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐరాస అధికార భాషలుగా అరబిక్, చైనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్ గుర్తింపు పొందాయి. ఐరాసలో ముఖ్యమైన 6 విభాగాల్లో జనరల్ అసెంబ్లీ, సెక్యూరిటీ కౌన్సిల్, ఎకనమిక్ అండ్ సోషల్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్, సెక్రటేరియట్, ట్రస్టీషిప్ కౌన్సిల్ (క్రియాశీలంగా లేదు) ఉన్నాయి. ఐరాస ప్రధాన విధుల్లో భాగంగా అంతర్జాతీయ శాంతి, భద్రతల స్థాపన, దేశాల మధ్య స్నేహబంధాలను నెలకొల్పుతున్నది. దేశాల మధ్య నెలకొన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మానవీయ సమస్యకు పరిష్కారాలు చూపుతూ, మానవహక్కులను కాపాడుతూ మౌలిక స్వేచ్ఛను కల్పిస్తున్నది. విపత్తులు, యుద్ధాలు విజృంభించిన సమయంలో ప్రజలను జాగృతపర్చడం, పర్యావరణ కాలుష్య నియంత్రణ, భూగోళాన్ని పరిరక్షించడం లాంటి అతి ముఖ్యమైన అంశాల్లో ప్రపంచ దేశాలను చైతన్యపరుస్తున్నది. దేశాల మధ్య సమానత్వం, నమ్మకాలను గౌరవించడం, దేశ అంతర్గత సమస్యలకు దూరంగా ఉండడం, సరిహద్దు వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడం లాంటి సూత్రాల ఆధారంగా ఐరాస పని చేస్తున్నది. ఐరాసకు అవసరమైన నిధులను సభ్యదేశాలే అందిస్తాయి. ఐరాసలో ముఖ్య ఏజెన్సీలుగా యునిసెఫ్, ఐఎల్‌వో, ఎఫ్ఏవో, డబ్ల్యూహెచ్‌వో, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ లాంటి 15 ఏజెన్సీలు తమ తమ విధులను నిర్వహిస్తున్నాయి. అంతర్జాతీయ శాంతి స్థాపనలో ప్రధాన పాత్ర పోషిస్తున్న యూఎన్‌వో భద్రతా మండలి (సెక్యూరిటీ కౌన్సిల్)లో ఐదు అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, యూకె, ఫ్రాన్స్, చైనా శాశ్వత సభ్యులుగా వీటో పవర్ కలిగి ఉన్నాయి. భద్రతా మండలిలో మరో 10 దేశాలకు 2 ఏండ్ల వ్యవధితో తాత్కాలిక వీటో లేని సభ్యత్వాన్ని కల్పిస్తారు. ఇండియా తాత్కాలిక సభ్యత్వ దేశంగా సేవలందించింది. ప్రస్తుత సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ముఖ్య పరిపాలనాధికారి (సీఏవో)గా సేవలందిస్తున్నారు. ఐరాస నిర్దేశిత నియమాలను తీవ్రంగా ఉల్లంఘించిన దేశ సభ్యత్వాన్ని భద్రతా మండలి సిఫారసుతో జనరల్ అసెంబ్లీ రద్దు కూడా చేయవచ్చు. ప్రపంచ దేశాల్లో 145 కోట్ల జనాభాతో కూడిన ఓ ప్రధానమైన దేశంగా భారత్‌కు భద్రతామండలిలో చోటు దక్కకపోవడం, చైనా లాంటి దేశాలు అడ్డుపుల్లలు వేయడం విస్మయాన్ని కలిగిస్తున్నది. ఆవిర్భావం నుంచి నేటి వరకు ఐరాస నిర్వహించిన పాత్ర ప్రశంసనీయంగా ఉంటూనే కొన్ని సందర్భాల్లో నిరాశనే మిగిల్చింది. అనేక ఆటంకాలు, సవాళ్ల నడుమ తన ఉనికిని చాటుకుంటూ, ప్రపంచదేశాల్లో శాంతి స్థాపన దిశగా అడుగులు వేస్తున్నది. ఐరాస చరిత్రలో ఎన్ని మైలురాళ్లు దాటినా, కొన్ని విషమ పరిస్థితుల్లో తగిన న్యాయం చేయలేకపోయిందనే విమర్శలను మూటకట్టుకున్నది. అమెరికా- ఇరాక్ మధ్య వివాదం, సూడాన్‌లో అకాల మరణాలు, నేడు కొనసాగుతున్న యుద్ధాలకు ముగింపు పలకడం లాంటి సందర్భాల్లో ఐరాస విఫలమైందని తెలుస్తున్నది. ఐరాస ఎదుర్కొంటున్న సవాళ్లలో పేదరికం, అనారోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం, దేశాల మధ్య సంఘర్షణలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, హింస, ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, అయు ధ సంపత్తి విస్తరణ లాంటివి ముఖ్యమైనవి. నేడు భీకరంగా జరుగుతున్న యుద్ధాలతోపాటు అమెరికా- చైనా మధ్య నెలకొన్న ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం ఐరాస లక్ష్యాలను ప్రశ్నార్థకం చేస్తున్నది. అగ్రరాజ్యాల ఆధిపత్య ధోరణులతో ఐరాస కార్యదక్షత అయోమయంలో పడుతున్నది. ఆయుధాలతో అగ్రరాజ్య స్థాయి సాధ్యపడదని, విశ్వమానవాళికి సుఖసంతోషాలు పంచడమే పెద్దరికం అవుతుందని అగ్ర దేశాలు గుర్తించాలి. ప్రపంచశాంతి స్థాపనలో ఐరాస పెద్దన్న మాదిరిగా నిలబడి, దేశాల మధ్య విభేదాలను చెరిపి, అవసరమైతే కొరడా ఝులిపి, సహకార భావనను పెంచి, ప్రపంచ కుగ్రామాన్ని సుందర నివాస ప్రదేశంగా నిర్మించాలని ఆశిద్దాం. ఐరాసను గౌరవిద్దాం, ప్రపంచశాంతికి పునాదులు వేద్దాం.

# రుబియో పర్యటన ఆంతర్యం!



అయిదేళ్లుగా పరస్పరం తలపడుతున్న రష్యా--ఉక్రెయిన్‌ల మధ్య సామరస్యం కుదర్చటానికి తూర్పు యూరోప్ వైపు వెళ్లకుండా... తన చలవతో అంటుకున్న పశ్చిమాసియా ప్రాంతాన్ని చల్లార్చడానికి పోకుండా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మధ్య ఆసియా దేశాలవైపు దృష్టి సారించారు. దాంతోపాటు మన దేశంలోనూ మూడు రోజులు పర్యటించారు. ఆ రెండు ఘర్షణల్లోనూ ఇంతవరకూ ఎక్కడా రుబియో పేరు వినబడలేదన్నది వాస్తవమే అయినా... ఆ దేశ జాతీయ భద్రతా సలహాదారుకూడా కనుక, ఆ కోణంలో అమెరికా ఆలోచనేమిటన్న ఆసక్తి అందరిలోనూ ఉంటుంది. 70వ దశకంలో అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి హెన్రీ కిసింజర్ తర్వాత ఆ జోడు పదవుల్ని దక్కించుకున్న ఖ్యాతి రుబియోది. ఆ మాటెలావున్నా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక గత రెండేళ్లుగా భారత్‌పై విరుచుకుపడటమే చూసిన వారందరికీ అమెరికా తాజాగా ప్రేమ ఒలకబోయడం ఆశ్చర్యంగానే ఉంది. నిజానికి భారత్‌లో మంగళవారం అడుగుపెట్టడానికి ముందే ఉజ్బెకిస్తాన్ పర్యటనలో భారత్, అమెరికాలు రెండూ వాణిజ్య ఒప్పందానికి 'చాలా చేరువ'లో ఉన్నాయని ఆయన ప్రకటించారు. వచ్చాక కూడా మన దేశంపై ఎంతో సానుకూలంగా మాట్లాడారు. రివాజుకు భిన్నంగా ఆయన ఢిల్లీలో కాక ముంబైలో అడుగుపెట్టారు. అంబానీ, అదానీలతో పాటు టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌ను కలిశారు. విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్‌తో ద్వైపాక్షిక సమావేశం తర్వాత ఇంధన భద్రత, రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు అంశాల్లో మనకున్న అవసరాలేమిటో అర్థం చేసుకున్నట్టు కనబడ్డారు. ఈమధ్య అమెరికా రష్యా, ఇరాన్ ఆంక్షల చట్టాన్ని తెచ్చినప్పుడు మన దేశం గట్టిగానే స్పందించింది. ఇది ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపగలదని చేసిన ప్రకటన అమెరికాపై 'తగినంత' ఒత్తిడి కలిగించిందని రుబియో వైఖరి తెలియజేస్తోంది. వాణిజ్య ఒడంబడిక కోసమే ఆ చట్టంనుంచి భారత్‌కు 60 రోజుల మినహాయింపునిచ్చామని కూడా ఉజ్బెకిస్తాన్‌లో ఆయన చెప్పారు. అసలు సంగతేమంటే... ఆ చట్టం వచ్చాక అమెరికాయే రష్యా డీజిల్ కొనాలని నిర్ణయించింది.

పెద్దన్న పద్ధతిలో అందరిపైనా పెత్తనం చలాయించాలని చూడటం, తరచు ఈసడించటం దౌత్యరంగంలో పనికిరాదని ట్రంప్ గ్రహించటంవల్లే రుబియోను భారత్ పంపారా అన్నది చూడాల్సివుంది. అమెరికా సెనేట్‌లో మన దేశానికి అనుకూలంగా వ్యవహరించే రిపబ్లికన్ పార్టీ నేతల్లో రుబియో ఒకరు. తనవల్ల చెడిన ద్వైపాక్షిక సంబంధాలను మరమ్మతు చేయడానికి ఆయనే తగిన వ్యక్తి అని ట్రంప్ అనుకుని ఉండొచ్చు. లేదా అమెరికాలో వచ్చే నెల జరగబోయే మధ్యంతర ఎన్నికల్లో ఏదోమేర విజయం సాధించాలంటే 'చాలా బాధ్యతాయుతంగా' వ్యవహరిస్తున్నట్టు కనబడటం ముఖ్యమని భావించి ఉండొచ్చు. ముంబైలో ఇరు దేశాలమధ్యా ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానంవంటి అంశాల్లో చర్చలు జరిగాయి. జైశంకర్-- రుబియో భేటీ తర్వాత యూఏఈ విదేశాంగమంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌ను కూడా చేర్చుకుని త్రైపాక్షిక సమావేశం నిర్వహించారు. రుబియో పర్యటన ఆంతర్యం ఏమైనా... మిత్ర దేశంగా ఉంటూ కూడా వివిధ అంశాల్లో అమెరికా తీరుతెన్నుల గురించీ, అందువల్ల మన దేశానికెదురవుతున్న సమస్యల గురించీ ఆయనకు నిష్కర్షగా చెప్పడం అవసరం. హెచ్1బి వీసాల వ్యవహారం కావొచ్చు... ఎడాపెడా వేసే సుంకాలు కావొచ్చు... పాకిస్తాన్‌ను అది దువ్వుతున్న తీరు కావొచ్చు-- అన్నీ మన దేశ ప్రయోజనాలను దెబ్బతీసేవే. వీటిని రుబియో దృష్టికి తీసుకొచ్చివుంటే మంచిదే. చాన్నాళ్లుగా అమెరికా క్వాడ్ ఊసెత్తడం మానేసింది. పైగా చైనాకు దగ్గరవుతోంది. ఎందుకో మళ్లీ క్వాడ్‌ను తెరపైకి తెస్తోంది. వచ్చేనెల జరగబోయే ఆగ్నేయాసియా దేశాల (ఆసియాన్) సమావేశంలో దానికి ప్రాణప్రతిష్ఠ చేయాలని చూస్తోంది. ఈ విషయంలో స్వీయ ప్రయోజనాలకే మనం ప్రాధాన్యతనీయాలి. నిలకడ లేకుండా, ఒక విధానమంటూ పాటించకుండా అమెరికా పాటిస్తున్న అరాచక దౌత్యం ఆగేవరకూ మన దేశం జాగ్రత్తగా అడుగులేయటం అత్యవసరం.

# చెరువుల్లో తీవ్ర నీటి కొరత



ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దఎత్తున పునరుద్ధరించిన సాగునీటి వనరులతో మత్స్యకారుల్లో భవిష్యత్తు పట్ల ఆశలు చిగురించాయి. కానీ నేటి కాంగ్రెస్ పాలకుల హయాంలో వారి ఆశలు నీటి మీది బుడగల్లా తేలిపోతున్నాయి. రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాలు ఒకవైపు తమకున్న చిన్న కమతాలను సాగు చేసుకుంటూనే, మరోవైపు చేపల వృత్తిపై ఆధారపడి బతుకు భరోసా పొందుతున్నారు. కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న అభివృద్ధి వ్యతిరేక వైఖరి ఫలితంగా ఒకవైపు నీటి ఎద్దడితో పొలాలు ఎండిపోయి, మరోవైపున చెరువుల్లో చేపపిల్లలు వదల్లేని దుస్థితిలో 'రెంటికీ చెడ్డ రేవడి'లా ప్రభుత్వ ప్రాయోజిత కరువుతో మత్స్యకారులు తల్లడిల్లిపోతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలను కల్లోల పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్న ఎల్ నినో దృష్టాంతాన్ని సాకుగా చూపిస్తూ పంటల సాగును నిలిపివేయాలంటూ స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి తెగేసి చెప్పడంతో రైతులకు వ్యవసాయం మీద ఆశలు ఆవిరైపోయాయి. మరోవైపున చెరువుల్లో నీటి సామర్థ్యం అడుగంటిపోతున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో ఇప్పటికే పూర్తిచేయాల్సిన ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని అటకెక్కించారు. దీంతో రాష్ట్రంలోని సుమారు ఆరు లక్షల మత్స్యకార కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.

ఎల్ నినో సృష్టిస్తున్న గడ్డు పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం తగ్గిపోయి, భూగర్భజలాలు అడుగంటిపోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సకల సమస్యలకు సాకుగా చూపే దుస్సాహసం చేస్తున్నది. గోదావరి నదిపై కేసీఆర్ సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ప్రాజెక్టుల నుంచి నీటిని ఎత్తిపోసి, పరీవాహక ప్రాంతాల్లోని జలాశయాలు, చెరువులను నింపేందుకు వీలున్నది. కానీ కాంగ్రెస్ పాలకులు అన్ని అవకాశాలను తమ వికృత రాజకీయ క్రీడలో భాగంగా బుద్ధిపూర్వకంగానే విస్మరించారు. గోదావరి నుంచి నీటిని ఎత్తిపోసుకొని, జలవనరులను నింపుకొని, చెరువులకు తరలించడం ద్వారా వేసవిలో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వీలున్న అవకాశాలను కావాలనే జారవిడిచారు. రాష్ట్ర రైతాంగంతోపాటు, అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వ ప్రాయోజిత కరవు పరిస్థితుల్లోకి నెట్టివేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా ఆడుతున్న ఈ వికృత చేష్టల ఫలితంగా రాష్ట్రంలోని లక్షలాది మత్స్యకార కుటుంబాలు తమ భవిష్యత్తుకు భరోసా లేక, ఉపాధి కరువై తల్లడిల్లిపోతున్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం 2016లో చేపపిల్లల ఉచిత పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. బీఆర్ఎస్ సర్కార్ అధికారంలో ఉన్నంత వరకు నిరాటంకంగా ఏటా ఈ పథకాన్ని అమలు చేసింది. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి కేవలం 2.40 లక్షల టన్నులుగా ఉన్న చేపల వార్షిక ఉత్పత్తి కేవలం ఎనిమిది సంవత్సరాల కాలంలోనే రెట్టింపు అయ్యింది. పర్యవసానంగా రాష్ట్రంలోని మత్స్యకారులు వార్షిక ఆదాయాల్లో కూడా గణనీయమైన వృద్ధిరేటు నమోదయ్యింది. అప్పటివరకూ పూర్తి నిర్లక్ష్యానికి గురైన మత్స్యకార వృత్తి తెలంగాణలో ఒక గౌరవనీయమైన వ్యాపకంగా మార్పు చెందింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు మూడేండ్ల కాలం నుంచి ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని అటకెక్కించేందుకు దశలవారీగా కుట్రలను అమలు పరుస్తున్నది. రాష్ట్రంలో చేపల పెంపకానికి అనువుగా ఉన్న సుమారు 29 వేల నీటివనరుల్లో కనీసం 86 కోట్ల నుంచి 98 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయాలని మత్స్య శాఖ ఏటా ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తున్నది. ఇందుకు అనుగుణంగా ఉచిత చేపపిల్లల పంపిణీ కోసం ఏటా సుమారు వంద కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం గత మూడేండ్లుగా ప్రతిసారీ ఆర్భాటంగా ప్రకటిస్తున్నది.

అయితే ఆచరణలో మాత్రం ఏ ఒక్క సంవత్సరంలోనూ మత్స్యశాఖ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో చేపపిల్లల పంపిణీ నిర్వహించిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో నిర్దేశించుకున్న లక్ష్యంలో కేవలం 56 శాతం మేరకు మాత్రమే ఉచిత చేపపిల్లలను వదిలినట్టు ప్రభుత్వ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. నిరుడు నిర్దేశించుకున్న లక్ష్యంలో కేవలం 30 శాతం మేరకు మాత్రమే చేప పిల్లలను పంపిణీ చేసినట్టు అధికారిక లెక్కలు చెప్తున్నాయి.

ఇక ఈ ఏడాది ఉచిత చేపపిల్లల పంపిణీ వ్యవహారం ప్రహసనంగా మిగిలిపోయింది. జూలైలో ప్రారంభం కావాల్సిన ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం.. అక్టోబర్ దాటుతున్నప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. అయితే విచిత్రంగా ఏదో ముహూర్తం మించిపోయినట్టుగా గత నెల 29వ తేదీన వనపర్తి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు అధికారికంగా ఒక కార్యక్రమాన్ని నిర్వహించి, పలువురు మంత్రులు చెరువుల్లో చేపపిల్లలను వదిలారు. కానీ రాష్ట్రంలోని మరే ఇతర ప్రాంతంలోనూ ఇంతవరకూ చేపపిల్లలను వదిలిన దాఖలాలు లేవు. కనీసం ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్న ఆనవాళ్లు కూడా ఎక్కడా కనిపించడం లేదు.

ఈ సంవత్సరం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి రూ.130 కోట్ల నిధులను కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్టంలో ఎంపిక చేసిన 29 వేల నీటివనరుల్లో 86 కోట్ల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు రాష్ట్ర మత్స్యశాఖ ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఆచరణలో ఇందుకు అనుగుణంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్న ఆనవాళ్లూ కనిపించకపోవడంతో ప్రాథమిక మత్స్య సహకార సంఘాలు ఉచిత చేపపిల్లల పంపిణీ విషయంలో ఆశలు వదులుకున్నాయి. ఇందుకు అనుగుణంగానే ముఖ్యమంత్రి ఇటీవల మీడియా సమావేశంలో ప్రస్తావించిన పలు అంశాలు మత్స్యకారులను పూర్తి నిరాశానిస్పృహల్లోకి నెట్టేశాయి.

రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో రానున్న యాసంగి (రబీ సీజన్) పంటలకు సెలవును ప్రకటించిన సర్కార్ అందుకు పరిహారంగా రైతులకు పలు రకాలైన కరువు సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధపడుతున్నట్టు భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నది.

జలాశయాలతోపాటు చెరువుల్లో తీవ్ర నీటి కొరత నెలకొని ఉన్న నేపథ్యంలో ఈ సంవత్సరం ఉచిత చేపపిల్లలను పంపిణీ చేసే ప్రయత్నాలను కూడా ప్రభుత్వం పూర్తిగా విరమించుకున్నట్లు తేటతెల్లమవుతున్నది. అయితే, చెరువుల్లో చేపల సంపదపైనే ఆధారపడిన లక్షలాది మత్స్యకార కుటుంబాలను ఈ కరువు పరిస్థితుల నుంచి కాపాడేందుకు ఎలాంటి చర్యలను తీసుకుంటుంది? అందుకు ఏ విధమైన కరువు సహాయక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి రాష్ట్రంలోని మత్స్యకారులను ఆదుకోవడానికి అమలు పరుస్తుంది? అనే అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన విధాన ప్రకటన వెంటనే వెలువరించాల్సిన అవసరం ఉన్నది. ఇందుకోసం రాష్ట్రంలోని మత్స్యసహకార సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచేందుకు అవసరమైన కార్యక్రమాలను రూపొందించుకుని అమలుపరచడం తక్షణ కర్తవ్యం. ప్రభుత్వం స్పందించకపోతే లక్షలాది మత్స్యకార కుటుంబాలు ప్రభుత్వ ప్రాయోజిత కరువు కారణంగా 'పరేషాన్' కాకతప్పదు!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు మూడేండ్ల కాలం నుంచి ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని అటకెక్కించేందుకు దశలవారీగా కుట్రలను అమలు పరుస్తున్నది. రాష్ట్రంలో చేపల పెంపకానికి అనువుగా ఉన్న సుమారు 29 వేల నీటివనరుల్లో కనీసం 86 కోట్ల నుంచి 98 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయాలని మత్స్య శాఖ ఏటా ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తున్నది. ఇందుకు అనుగుణంగా ఉచిత చేపపిల్లల పంపిణీ కోసం ఏటా సుమారు వంద కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్టు ప్రభుత్వం మూడేండ్లుగా ప్రతిసారీ ఆర్భాటంగా ప్రకటిస్తున్నది.

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



# అక్టోబర్ 25, 26వ తేదీల్లో మల్టిపుల్ మహాధర్నాను జయప్రదం చేయండి

**శామిర్పేట్, కీసర, మీ వార్త**

సిఐటియు కార్మిక చట్టాలు మరియు హక్కుల పరిరక్షణ కోసం సిఐటియు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద అక్టోబర్ 25, 26వ తేదీల్లో నిర్వహించ తలపెట్టిన మల్టిపుల్ మహాధర్నా ను జయప్రదం చేయాలని సిఐటియు కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద, ఎవీణూా కాంట్రాక్ట్ కార్మికుల సమక్షంలో మహాధర్నా వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా బంగారు నర్సింగరావు మాట్లాడుతూ. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను, చట్టాలను కాలరాస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ నెలకు రూ. 26,000 కనీస వేతనం చెల్లించాలి. ప్రతి నెలా 1వ తేదీన కార్మికుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జీతాలు జమ చేయాలి. కార్మికులందరికీ ఈఎస్ఐ , పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. వారాంతపు సెలవులను పక్కాగా అమలు చేయాలి.



కార్మికులందరికీ 9 రకాల సేఫ్టీ కిట్లను అందజేయాలి. అర్బన్ ఫారెస్ట్, పార్కులు, ఇంజనీరింగ్ మరియు పారిశుధ్య విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. కాంట్రాక్ట్ కాలపరిమితి ముగిసినప్పటికీ కార్మికులను మార్చకూడదు; అందరినీ యథావిధిగా విధుల్లో కొనసాగించాలి. ఈ కార్యక్రమంలో రింగ్ రోడ్డు (షామీర్‌పేట్ - కీసర - ఘట్‌కేసర్) పరిసర ప్రాంతాలకు చెందిన హెచ్ఎమ్‌డీఏ ఔట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప్పల్ లో వైభవంగా నాభిశిల (బొడ్డురాయి) పుష్కర 12వ వార్షికోత్సవం పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి







**ఉప్పల్, అక్టోబర్ 24 ( మన మీ వార్త):**

ఉప్పల్‌లో ఘనంగా నిర్వహించిన నాభిశిల (బొడ్డురాయి) పుష్కర 12వ వార్షికోత్సవ వేడుకల్లో ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి , ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.

అనంతరం పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "నాభిశిల (బొడ్డురాయి) పుష్కర 12వ వార్షికోత్సవాన్ని ఇంత వైభవంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులు, పెద్దలు, సేవకులు, భక్తులందరికీ నా హృదయపూర్వక అభినందనలు. ఈ పవిత్ర వార్షికోత్సవ సందర్భంగా ఉప్పల్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గంటంబొట్ల వెంకటరమణ శర్మ (కన్నయ్య), శ్రీకర్ శర్మ, తెల్కల మోహన్ రెడ్డి, పూజల ప్రభాకర్, చిందం వెంకటేష్, లింగంపల్లి రామకృష్ణ, సుంకు శేఖర్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, మంద మురళీకృష్ణ రెడ్డి, వర్కాల మదన్ గౌడ్, సత్తిరెడ్డి, ఆల్వాల్ భాస్కర్, జనగామ రామకృష్ణ, అనిల్, తోకట రాజు, కుమార్, నరేష్ ముదిరాజ్, ఢిల్లీ చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, బాబీతో పాటు బొడ్డురాయి కమిటీ సభ్యులు మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# శ్మశానవాటిక రోడ్డు పనులు ప్రారంభం

**చిట్యాల అక్టోబర్ 24 మీ వార్త**

చిట్యాల గ్రామంలో సీఆర్ఆర్ నిధులు రూ.70 లక్షలతో చేపట్టనున్న శ్మశానవాటిక రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. గత సంవత్సరం 2025లో శంకుస్థాపన చేసిన ఈ రోడ్డు పనులను పంచాయతీరాజ్ ఏఈ అరుణ , ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు తౌటం నవీన్, మైదం శ్రావ్య శ్రీకాంత్, శనిగారపు మొగిలి, వేల్పుల లక్ష్మీ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

గత సంవత్సరం శంకుస్థాపన జరిగినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో, గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య రెండు జనరల్ బాడీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. శ్మశానవాటిక రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు.



ఈ సందర్భంగా రూ.70 లక్షల సీఆర్ఆర్ నిధులతో చేపడుతున్న శ్మశానవాటిక రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కి సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సదరు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సర్పంచ్ సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైరం భద్రయ్య, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చిలుముల రమణాచారి, ఉప్పల కిరణ్, ముసాపురి రవీందర్, ఉప్పల రవీందర్, పిట్టల రవీందర్, జెట్టి రాజన్న, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హెచ్ఎంటీ నగర్ పార్కులో అధునాతన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి నిధులు మంజూరు

- వాకర్స్, భక్తులు, స్థానిక వ్యాపారస్తులకు మెరుగైన సౌకర్యాలు
- పార్కు లోపల అనువైన ప్రదేశంలో నిర్మాణానికి కాలనీ ప్రతినిధుల ఏకగ్రీవ అంగీకారం

**నాచారం, అక్టోబర్ 24 ( మన మీ వార్త):**

హెచ్ఎంటీ నగర్ పార్కుకు వాకింగ్ కోసం వచ్చే ప్రజలు, సమీపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి విచ్చేసే భక్తులు, హెచ్ఎంటీ నగర్ ప్రాంతంలోని వ్యాపారస్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. హెచ్ఎంటీ నగర్ పార్కులో అధునాతన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

**పార్కులో అనువైన స్థలంపై చర్చ**

పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి సంబంధించి అధికారులు తొలుత పార్కు ముందు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అయితే పార్కు ముందు భాగంలో కాకుండా, పార్కు లోపల అనువైన ప్రదేశంలో టాయిలెట్‌ను ఏర్పాటు చేయాలని కాలనీ ప్రతినిధులు సూచించారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటు పార్కు పరిసరాల నిర్వహణకు అనుకూలంగా ఉండేలా తగిన స్థలాన్ని ఎంపిక చేయాలని అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనకు కాలనీ ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారు.



కార్యక్రమంలో పలువురు ప్రముఖులు
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, డీఈ సాయి పృథ్వి, ఏఈ సూరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, హెచ్ఎంటీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామ్ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు యాదగిరి రెడ్డి, బాల్‌రెడ్డి, కిరణ్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు మరింత సౌకర్యం**

పార్కుకు ప్రతిరోజూ వచ్చే వాకర్స్, ఆలయానికి విచ్చేసే భక్తులు, స్థానిక వ్యాపారస్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధునాతన పబ్లిక్ టాయిలెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో ప్రజా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.

## ముగ్గురిపై కేసు నమోదు - ఎస్సై పోచంపల్లి సతీష్

**చిట్యాల అక్టోబర్ 24 మీవార్త**

చిట్యాల మండలం, వెంకట్రావుపల్లి గ్రామంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు ఎస్సై పోచంపల్లి సతీష్ నిందితుల వివరాలు: మండల కేంద్రానికి చెందిన బోళ్ళ సతీష్, రుద్రవేణి వెంకటస్వామి,గొల్కొండ మొగిలి శనివారం రోజున

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న ముగ్గురు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల మీద మద్యం సేవించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్సై పోచంపల్లి సతీష్ హెచ్చరించారు.



## అధిక లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

-విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతుల ఆందోళన..

-పంటలు ఎండిపోయే ప్రమాదం

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (24):**



అధిక విద్యుత్ లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగిన ఘటన మండల పరిధిలోని భోజ్యా తండాలో శనివారం చోటుచేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. భోజ్యా తండాలో వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌కు 14 బోరు కనెక్షన్లు ఉండటంతో అధిక లోడ్ పడుతోందని తెలిపారు. ఈ క్రమంలో శనివారం ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు చెలరేగినట్లు పేర్కొన్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికే పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులు,ప్రస్తుతం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలకు నీరందక ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన చర్యలు తీసుకుని పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## మృతుడి కుటుంబాన్ని పరమర్శించిన ఏవైఎస్ నాయకులు

**చిట్యాల అక్టోబర్ 24 మీ వార్త**



చిట్యాల మండల కేంద్రంలోని రాంనగర్ కాలానికి చెందిన ఏకు కిషన్ తండ్రి ఏకు పోషయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని శనివారం రోజున అంబేద్కర్ యువజన సంఘం మండల అద్యక్షుడు జన్నె యుగేందర్ ఆద్వర్యంలోకుటుంబాన్ని పరామర్శించి పోషయ్య చిత్రపటానికి అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య పూలు వేసి నివాళులర్పించడం జరిగింది అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి సంతాపాన్ని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రాజేందర్ ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు పుల్ల అశోక్ మాదిగ జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ పర్లపెల్లి వంశీ అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు గుర్రపు రాజ మొగిలి గడ్డం సదానందం మాదిగ జాగృతి సంఘం మండల ప్రధాన కార్యదర్శి కండే రమేష్ అంబేద్కర్ వాదులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బాలాజీ నగర్ డివిజన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం



**కూకట్పల్లి అక్టోబర్ 24 మన మీ వార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి--మహబూబ్‌నగర్--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధికార ప్రతినిధి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సత్యం శ్రీరంగం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు ప్రతాప్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బి. సంజీవరావు హాజరయ్యారు.

అలాగే బాలాజీ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల జశ్వంత్ రావు (దేశాల్), క్రిస్టియన్ మైనారిటీ కోఆర్డినేటర్ మేకల మైఖేల్, ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసిన విట్టల్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ, పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యావంతుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## సురకంటి లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి

**లక్ష్మన్ చందా, అక్టోబర్ 24(మన మీ వార్త)**



మండలంలోని చామన్‌పల్లి గ్రామానికి చెందిన సురకంటి రాజారెడ్డి, కిష్టారెడ్డి గార్ల తల్లి సురకంటి లక్ష్మి గత 15 రోజుల క్రితం స్వర్గస్తులయ్యారు.

ఈ నేపథ్యంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి శనివారం రోజున వారి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో చామన్‌పల్లి సర్పంచ్ లక్ష్మి సుదర్శన్ , ఉప సర్పంచ్ గంగారెడ్డి , మాజీ సర్పంచ్ గంగాధర్ , మాజీ ఉప సర్పంచ్ రమణ , గ్రామ నాయకులు మహిపాల్ రెడ్డి, రమేష్, నర్సారెడ్డి, మధు, రాజేందర్ పలువురు పాల్గొన్నారు.

# మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన





- వృథాగా వెళ్తున్న నీటిని పరిశీలించిన ప్రజాప్రతినిధులు
- ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ఉప్పల్, అక్టోబర్ 24 ( మన మీ వార్త):**

మేడిగడ్డ బ్యారేజీ వద్ద నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, వృథాగా వెళ్తున్న నీటి ప్రవాహాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, వివేకానంద గౌడ్, మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం, వృథాగా వెళ్తున్న నీటి పరిస్థితులను వారు నిశితంగా పరిశీలించారు. ప్రజాధనంతో నిర్మించిన భారీ సాగునీటి ప్రాజెక్టుల పరిరక్షణ, నిర్వహణ, నీటి వనరుల సమర్థ వినియోగంపై సమీక్షించాల్సిన అవసరాన్ని ఈ పర్యటన ప్రధానంగా చర్చకు తెచ్చింది.

---రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి

తెలంగాణలో వ్యవసాయం, తాగునీటి సరఫరా, రైతుల జీవనోపాధికి సాగునీటి ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులు ఆశించిన ప్రయోజనాలను అందించాలంటే వాటి భద్రత, నిర్మాణ నాణ్యత, నిర్వహణ, నీటి నిల్వ సామర్థ్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అందుబాటులో ఉన్న నీటి వనరులు వృథా కాకుండా ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ప్రాధాన్యత సంతరించుకుంది.సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో తలెత్తే సమస్యలను గుర్తించి, సాంకేతిక నిపుణులతో సమగ్రంగా పరిశీలన జరిపించి, అవసరమైన చర్యలు చేపట్టడం కీలకమని పర్యటన నేపథ్యంలో స్పష్టమవుతోంది. ప్రాజెక్టుల ద్వారా రైతులకు సకాలంలో సాగునీరు అందడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి పెరిగి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి వీలుంటుంది.

ప్రాజెక్టులపై నిరంతర పర్యవేక్షణ అవసరం ప్రజాధనంతో నిర్మించిన భారీ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా వాటి ప్రస్తుత పరిస్థితి, భద్రత, నిర్వహణ, నీటి వినియోగంపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిపై సమగ్ర సాంకేతిక పరిశీలన జరిపి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టడం ద్వారా నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఈ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

## రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అర్బన్ వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియామకం

**కూకట్పల్లి అక్టోబర్ 24 మన మీ వార్త**



**రంగారెడ్డి జిల్లా:** భారతీయ జనతా పార్టీ యువజన విభాగమైన భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రంగారెడ్డి అర్బన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియమితులయ్యారు.

ఈ సందర్భంగా పంతంగి హర్ష యాదవ్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డికి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తోపుకొండ మైపాల్ రెడ్డికి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్‌కు, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పొట్లపల్లి సాయికుమార్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, యువతను పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షిస్తూ బీజేవైఎంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హర్ష యాదవ్ పేర్కొన్నారు. యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

## పాత వీడియోలకు కొత్త టైటిల్ పెడుతున్నారు

**(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 24, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**



తెలంగాణ రాష్ట్రంలో కేటీఆర్ కు, కల్వకుంట్ల కుటుంబానికి హీనమైన చరిత్ర ఉందని వారు చేసిన దోపిడిలు, పాపలు మరెవ్వరు చేయలేరని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి ఫైర్ అయ్యారు. ఇటీవల సోషల్ మీడియాలో తన పేరుతో పోస్టు చేసిన వీడియోలపై కేటీఆర్ కు కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్, కేసీఆర్ కుటుంబం చేసిన మోసాల, పాపల హిస్టరీ ఉందన్నారు. 2024 ఎన్నికల సమయంలో మైనార్టీలతో ముఖ్యంగా ఉర్దూ జర్నలిస్టులతో ప్రెస్ మీట్ లో నేను చేసినట్లు వ్యాఖ్యల పాత వీడియోలను కొత్త టైటిళ్ళతో సోషల్ మీడియాలో రిలీజ్ చేశారని అన్నారు. కేటీఆర్ కు తనను టార్గెట్ చేయాలని ఎంతో వెతుకుతున్నారని కానీ తాను తప్పు చేయలేదని అందుకే పాత వీడియోలకు కొత్త టైటిళ్ళు పెడుతున్నారని విమర్శలు చేశారు. 2019 ఎన్నికల్లో కల్వకుంట్ల కవితను ఓడించిన తర్వాత ఆమె ఇక్కడి నుంచి పారిపోయిందని అందుకు కేటీఆర్ కారణమన్నారు. తాను 2024 ఎన్నికల సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ముస్లింలకు మోడి ప్రభుత్వం హయంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ళు, ఉచితంగా రేషన్ బియ్యం, ఉచిత విద్య, వైద్యం అందుతున్నాయని అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతూ ఓటు వేయాలని అడిగింది వాస్తవమేనన్నారు. మైనార్టీలు ఓట్లు వేసినా, వేయకపోయినా తాను గెలుస్తానని ఆనాడు చెప్పానని, ఈనాడు కూడా దానికి కట్టుబడి ఉన్నానని అన్నారు. తాను అనని మాటలను ఎవరికి ఓట్లు వేసినా అవి బీజేపీకే పడుతాయని అన్న వ్యాఖ్యలు తాను చేయలేదని గుర్తు చేశారు. తాను ఆనాటి ప్రెస్ మీట్ లో చేసిన వ్యాఖ్యల గురించి ఎవరికి సంజాయిషి ఇచ్చుకోవాలసిన అవసరం లేదన్నారు. మోడి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్య, వైద్యంను ఆనాడు కేసీఆర్ అనే బడుద్దాయి అమలు చేయలేదని ప్రస్తుతం ఉన్న మరో బడుద్దాయి కూడా దానిని రాష్ట్రంలో కొనసాగించడం లేదని అరవింద్ విమర్శించారు.

## విద్యుత్ సరఫరాలో ప్రభుత్వ నిర్లక్ష్యం పై మండిపడ్డ బిఆర్ఎస్ మాసాయిపేట జాతీయ రహదారి44పై రాస్తారోకో..

- నిలిచిన వాహనాల రాకపోకలు




**అక్టోబర్ 24 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి :**

రైతులకు వ్యవసాయ సాగు కోసం ప్రభుత్వం ఇస్తున్నవిద్యుత్ కోతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే సునీత రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మాసాయిపేట 44 నెంబర్ జాతీయ రహదారిపై బిఆర్ఎస్ పార్టీ రైతులు బయట నుంచి రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారిపై వాహనాలు సందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు విద్యుత్ శాఖ అధికారులు రైతులకు సరిపడా విద్యుత్ సరఫరా చేస్తామని సముదాయించడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం అని అసలే వర్షాభావం ఏర్పడి రైతులు వేసిన పంటలు ఎండిపోతుండగా వ్యవసాయ సాగు కోసం సక్రమంగా విద్యుత్తు అందించడం లేదని మండిపడ్డారు.ఇప్పటికైనా ప్రభుత్వం కర్షకుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు నిరంతర విద్యుత్తు అందజేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో రైతుల పక్షాన ప్రభుత్వం పై పోరాటం తప్పదని ఆమె హెచ్చరించారు

# బీసీ రాజ్యాధికారం సాధించాలంటే గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు తప్పనిసరి - రవి పటేల్ పిలుపు

**భూపాలపల్లి అక్టోబర్ 24 మీ వార్త**

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత, రాజ్యాధికారం దక్కాలంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు చేసుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు నవంబర్ 6తో ముగియనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

**గతంలో ఓటు వేసినవారు కూడా మళ్లీ నమోదు చేసుకోవాలి!**

గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నామని, మళ్లీ నమోదు చేసుకోవాలా? అనే సందేహం చాలామందిలో ఉందని రవి పటేల్ పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లు ప్రస్తుత ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో నిర్ధారించుకోవాలని, ఎన్నికల అధికారుల నిబంధనల ప్రకారం అవసరమైతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులు సంబంధిత ధ్రువపత్రాలతో ఓటరు నమోదుకు ముందుకు రావాలని కోరారు.

భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో



టీఆర్పీ పార్టీ నాయకులు అందుబాటులో ఉంటారని, గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్, మార్కుల మెమో తదితర అవసరమైన పత్రాలతో వారిని సంప్రదిస్తే నమోదు ప్రక్రియలో సహకరిస్తారని తెలిపారు. ఒక్క ఓటు కూడా వృథా కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఓట్లు మనవి.. అధికారం మాత్రం అగ్రకులాలకేనా? రాష్ట్రవ్యాప్తంగా బీసీ రాజ్యాధికార ఉద్యమం బలంగా సాగుతున్న తరుణంలో, ప్రధాన రాజకీయ పార్టీలు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. అగ్రకులాలకు చెందిన నాయకులకు అవకాశాలు కల్పిస్తూ, జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలకు రాజకీయ అధికారంలో తగిన భాగస్వామ్యం కల్పించకపోవడం అన్యాయమని విమర్శించారు.

బీసీల ఓటు బీసీల రాజకీయ ఎదుగుదలకు బలమైన ఆయుధం కావాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేసుకొని, తమ సామాజిక వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు పెరిగితేనే మన గొంతు రాజకీయ వ్యవస్థకు బలంగా వినిపిస్తుందని, ప్రజాస్వామ్యంలో మన హక్కులను సాధించుకునే అవకాశం మరింత బలపడుతుందని అన్నారు.

తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో బీసీ రాజ్యాధికార సాధన కోసం పార్టీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్పీ బీసీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే కృషి చేయాలని కోరారు.

కావున భూపాలపల్లి నియోజకవర్గంలోని అర్హులైన గ్రాడ్యుయేట్లు నవంబర్ 6లోపు ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకొని, బీసీ రాజ్యాధికార ఉద్యమానికి అండగా నిలవాలని రవి పటేల్ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇనుగాల ప్రణయ్ రాజ్, మోటపోతుల సమ్మయ్య, సురేందర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి లీకేజీలను అరికట్టండి (HMWS & SB) జీఎంకు సీపీఐ నేతల వినతి

**జవహర్ నగర్, అక్టోబర్ 24 :(వార్త ప్రతినిధి)**

జవహర్ నగర్ లో తరచూ జరుగుతున్న మంచినీటి లీకేజీలను వెంటనే అరికట్టి, నీటి వృథాను నివారించాలని కోరుతూ సీపీఐ నాయకులు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ జనరల్ మేనేజర్ సునీల్ కు వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్. దశరథులు మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల తీవ్ర నీటి కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో తాగునీటితో పాటు సాగునీటి వనరులను కాపాడాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే



ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు.

అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల జవహర్ నగర్ లోని వికలాంగుల కాలనీలో తరచూ మంచినీటి పైపులు లీకేజీ అయి వేల లీటర్ల నీరు రోడ్లపై వృథాగా ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఒకవైపు నీరు వృథా అవుతుండగా, మరోవైపు కాలనీ ప్రజలకు సరైన ఒత్తిడితో నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే స్పందించి లీకేజీలను మరమ్మత్తు చేయాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా గిరి ప్రసాద్ నగర్ లో నీటి సరఫరా సమస్య తీవ్రంగా ఉందని వారు పేర్కొన్నారు. గతంలో రోజు విడిచి రోజు ఇచ్చే మంచినీరు ప్రస్తుతం వారానికి ఒకసారి మాత్రమే ఇస్తున్నారని, అది కూడా అరకొరగా రావడంతో స్థానిక ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. గిరి ప్రసాద్ నగర్ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి. వెంకటాచారి, ఏఐటీయూసీ నాయకులు ఏ. ఎల్లయ్య, రైతు సంఘం నాయకులు పి. నరసింహ, ఆదర్శనగర్ సీపీఐ కార్యదర్శి పి. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర హౌస్ నూతన రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కూకట్ పల్లి పాత్రికేయులు

**కూకట్ పల్లి అక్టోబర్ 24 మన మీ వార్త**



కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్ర హౌస్ రెస్టారెంట్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. రెస్టారెంట్ నిర్వాహకులు క్రాంతి కుమార్, గోపి చారి మరియు వారి మిత్రుల ఆహ్వానం మేరకు కూకట్ పల్లి పాత్రికేయులు రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, మైత్రి కన్స్ట్రక్షన్స్ ఎండి దాసరి రాహుల్ ప్రదీప్, ఎడ్ల రంజిత్, నామాల శ్రీధర్, మారుతి సాగర్, కాసాని రంజిత్, అనిల్ యాదవ్ ఈ కార్యక్రమానికి హాజరై రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘన స్వాగతం పలికి అతిధులను శాలువాతో సన్మానించారు. అనంతరం తెల్ల హరికృష్ణ రెస్టారెంట్ నిర్వాహకులు క్రాంతి కుమార్, గోపి చారి మరియు వారి మిత్రులను అభినందిస్తూ, ఆంధ్ర హౌస్ రెస్టారెంట్ ప్రజల ఆదరణ పొందుతూ విజయవంతంగా కొనసాగాలని, లాభాల బాటలో పయనించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, వినియోగదారులకు రుచి, శుచి, నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రెస్టారెంట్‌కు వచ్చే వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు, వారి మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

# పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎలినోపై విద్యార్థులకు అవగాహన సదస్సు

- నీరు ఉంటేనే జీవితం అనే అంశంపై సదస్సు నిర్వహించిన
- ప్రధానోపాధ్యాయులు సాంబయ్య




**అక్టోబర్ 24 మన మీ వార్తా ప్రతినిధి వెల్దుర్తి :**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన వెల్దుర్తి లోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నాడు ఎలినోవ పై అవగాహన సదస్సు విద్యార్థులకు నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య ఇది నువ్వు ప్రభావం వల్ల వర్షపాతం తక్కువ ఉష్ణోగ్రతలు పెరగడం నీటి లభ్యత తగ్గడం సాగునీరు త్రాగునీరు తీవ్ర రూపం దాలిస్తుందని ఆయన అన్నారు నీటి నిల్వలను కాపాడడం లీకేజీలను మరమ్మత్తులు చేయడం ఇంకుడు గుంతలు నిర్మించడం వర్షపు నీటిని సంరక్షించడం వ్యవసాయంలో నేటి సామర్థ్యాన్ని పెంచడం మొక్కలు నాటడం వంటి ఎనిమిది అంశాలపై పోస్టర్ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు ప్రతిదీ పోతూ అమూల్యమైనదని పొదుపు చేయడం వృధాను అరికట్టడం మనమందరం కలిసి నీటిని సంరక్షిద్దామని ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రాధిక శైలజ జయసుధ వెంకటస్వామి శ్రీనివాసరావు అమూల్య సునీత ఖదీర్ భాష విజయ్ వెంకట్ రెడ్డి రేణుకా దేవి తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ అభివృద్ధికి రూ.35 కోట్లు మంజూరు - మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



**జవహర్ నగర్, అక్టోబర్ 24 :(వార్త ప్రతినిధి)**

జవహర్ నగర్ డివిజన్ పరిధిలో 115 అభివృద్ధి పనుల సీసీ రోడ్లు మరియు యుజిడి కోసం రూ.35 కోట్ల నిధులను మంజూరు చేయించిన ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జవహర్ నగర్ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

జవహర్ నగర్ డివిజన్ అభివృద్ధికి రూ.35 కోట్ల నిధుల మంజూరు కోసం కృషి చేసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ మేరకు జవహర్ నగర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్, జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ జవహర్ నగర్ అభివృద్ధి పట్ల మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ చూపిస్తున్న చొరవ అభినందనీయమని అన్నారు. ఈ నిధులతో డివిజన్ లో పెండింగ్ లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి తదితర మౌలిక వసతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు గజ్వేల్ శంకర్, డీఎస్ఎస్ వెంకటేశ్వర్లు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మనుబోతులగడ్డ సెకండరీ పాఠశాలలో శ్రమదానం



**ఖానాపురం అక్టోబర్ 24 (మల్లేష్ మీవార్త ప్రతినిధి) :**

ఖానాపురం మండలం మనుబోతులగడ్డ గ్రామంలోని సెకండరీ పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు శనివారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆబోతు శ్రీలత అశోక్ యాదవ్ అద్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడూతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.గ్రామ అభివృద్ధిలో పాఠశాల పరిశుభ్రత కీలకమైనది. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు.
ఈ శ్రమదాన కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొడుగు రమ యాకన్న, గ్రామ కార్యదర్శి ప్రమీల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఎస్కే నాగుల్ మీరా, మాజీ ఉపసర్పంచ్ ములుకుంట్ల యాకన్న, వార్డు నంబర్ ఆబోతు రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, యువకులు మ్రి మహేందర్, రాకేష్‌తో గ్రామస్తులు పాల్గోన్నారు.

# బీసీ సంక్షేమ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- కులవృత్తుల అభివృద్ధికి 100 శాతం సబ్సిడీతో రుణాలు అందించాలి
- బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, వరంగల్ జిల్లా, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్

**వరంగల్ అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి ) :**

తెలంగాణ రాష్ట్రంలో బీసీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధుల వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, వరంగల్ జిల్లా, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు, నర్సంపేట మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ వర్గాలకు న్యాయం చేయడంతో పాటు వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రాష్ట్రంలోని బీసీ వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు అధికారికంగా ఎప్పుడు ప్రకటిస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

బీసీ సంక్షేమ బడ్జెట్‌పై లెక్కలు చెప్పాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.9,200 కోట్లు, 2025 బడ్జెట్‌లో రూ.11,405 కోట్లు, 2026 బడ్జెట్‌లో రూ.12,511 కోట్లు కేటాయించినట్లు ప్రకటించిందని బత్తిని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మూడు సంవత్సరాలకు సంబంధించిన కేటాయింపులు మొత్తం రూ.33,116 కోట్లు అవుతున్నాయని తెలిపారు.
ఈ నిధులను ఏయే రంగాలకు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? బీసీ నిరుద్యోగ యువత, కులవృత్తులపై ఆధారపడిన కార్మికులు, మహిళలు, విద్యార్థులకు ఎంత మేరకు లబ్ధి చేకూరింది? బీసీల ఆర్థిక అభివృద్ధి కోసం ఎలాంటి పథకాలు అమలు చేశారు? అనే అంశాలపై ప్రభుత్వం పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.



బడ్జెట్‌లో ప్రకటించిన కేటాయింపులు, వాస్తవంగా విడుదల చేసిన నిధులు, చేసిన ఖర్చులు, లబ్ధిదారుల వివరాలను వేర్వేరుగా వెల్లడిస్తూ సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని బీసీ సంఘాలు, బీఆర్ఎస్ పార్టీ తరఫున కోరుతున్నట్లు తెలిపారు.

కుల సంఘాల కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలి

రాష్ట్రంలో రజక, నాయి బ్రాహ్మణ, ఉప్పర, వాల్మీకి బోయ, కృష్ణ బలిజ పూసల, బట్రాజు, కుమ్మరి శాలివాహన, విశ్వబ్రాహ్మణ, మేదర, గీత కార్మికులు, పద్మశాలి, వడ్డెర, ముదిరాజ్, యాదవ కులాలకు సంబంధించిన సహకార సంఘాలు, ఫెడరేషన్లు, కార్పొరేషన్లతో పాటు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

ఈ సంస్థలకు చైర్మన్లు ఉన్నప్పటికీ సంబంధిత కులాలకు చెందిన నిరుద్యోగ యువత, వృత్తి కార్మికులు, చిన్న పారిశ్రామికవేత్తలకు ఆశించిన స్థాయిలో ఆర్థిక సహాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సంస్థలకు తగిన నిధులు కేటాయించి, అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఆర్థిక చేయూత అందించాలని కోరారు.

కులవృత్తులకు 100 శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలి
బీసీల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం కింది చర్యలు తీసుకోవాలని బత్తిని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

ప్రతి బీసీ కులానికి చెందిన కులవృత్తుల కార్మికులకు వారి వృత్తి అభివృద్ధి, ఆధునిక పరికరాల కొనుగోలు, వృత్తి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు 100 శాతం సబ్సిడీతో ఆర్థిక సహాయం అందించాలి.
నిరుద్యోగ యువతీ యువకులకు వారి నైపుణ్యాలకు అనుగుణంగా చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేందుకు యంత్రాలు, వాహనాలు, అవసరమైన పరికరాలు సబ్సిడీపై అందించాలి.
విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలి.
అన్ని బీసీ కులాల కార్మికులకు ఉచిత వైద్య, ఆరోగ్య బీమా సదుపాయాలు కల్పించాలి.

కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన సహకార సంఘాలకు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, 100 శాతం సబ్సిడీతో ఆర్థిక సహాయం అందించాలి.
బీసీ మహిళలు చేపట్టే కుటీర పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి.
ప్రభుత్వ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక చేయూత
బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ), షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టెక్స్‌టైల్ కార్పొరేషన్, ఉమెన్స్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి సంస్థల ద్వారా కూడా బీసీ వర్గాలకు అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలు అందించాలని కోరారు.

జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం చేయాలి
తెలంగాణలో బీసీల జనాభా వాటాపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి తీసుకురావాలని, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, చట్టసభలు, స్థానిక సంస్థల్లో బీసీలకు న్యాయమైన వాటా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బత్తిని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

బీసీల హక్కులు, రిజర్వేషన్లు, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం బీసీ సంక్షేమ నిధులపై శ్వేతపత్రం విడుదల చేసి, అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, కేటాయించిన నిధులను పారదర్శకంగా వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఐపీ చానళ్ళకు అక్రెడిటేషన్లు లేవు - తేల్చి చెప్పిన మంత్రి పొంగులేటి

- జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు త్వరలో ఇస్తాం

**హైదరాబాద్,అక్టోబర్ 24 (మల్లేష్ మీవార్త ప్రతినిధి) :**

రాష్ట్రం కేబుల్ టీవీల స్థానంలో నడుస్తున్న ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్(ఐపీ) ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వడం కుదరదని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తేల్చి చెప్పారు. ఇప్పటికే 26 వేల అక్రెడిటేషన్ కార్డులిచ్చామని,గతంలో కంటే నాలుగు వేల కార్డులు ఎక్కువే ఇచ్చామని, గతంలో లేని ఐపీ చానళ్ళకు కొత్తగా అక్రెడిటేషన్ కార్డులివ్వలేమని ఆయన స్పష్టం చేశారు.
శనివారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలో కేబుల్ చానల్స్ ప్రతినిధులు, పలువురు ఫెడరేషన్ నాయకులు సచివాలయంలో మంత్రి పొంగులేటి ని కలిసి కేబుల్ ఐపీ చానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు, జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించి, సొంతఇంటి కలను సాకారం చేస్తామని మంత్రి అన్నారు. జర్నలిస్టులకు గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా ఇళ్ల స్థలాలు



అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఇళ్ళస్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ కూడా పారదర్శకంగా కొనసాగుతుందని, గత ప్రభుత్వం కేవలం 21వేల అక్రెడిటేషన్లు ఇస్తే... తమ ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 26వేల అక్రెడిటేషన్లు ఇచ్చిందని చెప్పారు. అక్రెడిటేషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని, అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు ఇస్తామని మంత్రి అన్నారు. అంతకుముందు ఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య మంత్రితో మాట్లాడుతూ, రాష్ట్రంలో కొన్నేళ్ళుగా కేబుల్ నెట్వర్క్ ద్వారా నడిచిన అనేక న్యూస్ చానళ్ళు ప్రస్తుతం మారిన టెక్నాలజీకి అనుగుణంగా ఐపి ద్వారా నడుస్తున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఐపీ టీవీ న్యూస్ ఛానళ్ళకు కూడా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఎంతోమంది జర్నలిస్టులు ఇళ్ళస్థలాల కోసం ఎన్నో ఏళ్ళుగా ఎదిరిచూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళస్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకూ హెల్త్ కార్డులు జారీ చేయాలని, అరవై ఏళ్ళ వయసు పైబడి సీనియర్ పాత్రికేయులకు పెన్షన్ స్కీం అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, రవికుమార్, జాతీయ కౌన్సిల్ మెంబర్ బి.మల్లేష్ గౌడ్ , కేబుల్ చానెల్ అసోసియేషన్ ప్రతినిధులు సుభాష్, భరత్, శ్రీరాములు, షఫియుద్దీన్, ప్రతాప్, రాచర్ల గోపి, సుధాకర్, విఘ్నేష్ గౌడ్ తదిరులున్నారు.

# భక్తిశ్రద్ధలతో శబరిమల మహాపాదయాత్ర ప్రారంభం

- అయ్యప్ప స్వాముల పాదయాత్రకు శ్రీకారం చుట్టిన నందారం నరసింహ గౌడ్
- యాత్ర బృందానికి రూ.లక్ష ఆర్థిక సాయం

**పటాన్‌చెరు, అక్టోబర్ 24 (మీ వార్త ప్రతినిధి):**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట దుర్గామాత ఆలయం నుంచి కేరళలోని పవిత్ర పుణ్యక్షేత్రం శబరిమలకు చేపట్టిన 'బి.హెచ్.ఇ.ఎల్. టెంపుల్ శ్రీ శబరిమల 3వ మహాపాదయాత్ర' శనివారం ఉదయం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అయ్యప్ప స్వాముల మహాపాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేపట్టిన అయ్యప్ప భక్తుల బృందానికి నందారం నరసింహ గౌడ్ తన వంతు సహాయంగా



రూ.1,00,000 (లక్ష రూపాయలు) ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కిష్టారెడ్డిపేట నుంచి కాలినడకన శబరిమలకు చేరుకోవడం ఎంతో కఠినమైన భక్తి ప్రయాణమని పేర్కొన్నారు. సుమారు 40 రోజులకు పైగా ఎండనక, వాననక, రాత్రింబవళ్లు కఠిన నియమ నిష్ఠలతో సాగే ఈ మహాపాదయాత్ర మణికంఠుడి దివ్య ఆశీస్సులతో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అయ్యప్ప



స్వాముల యాత్ర నిరాటంకంగా కొనసాగి, అందరూ క్షేమంగా శబరిమలకు చేరుకుని స్వామివారి దర్శనం చేసుకోవాలని కోరుకున్నారు. లోకకల్యాణం కోసం భక్తులు చేపట్టిన ఈ పవిత్ర సంకల్పం నెరవేరాలని, స్వామివారి అనుగ్రహం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములతో పాటు పలువురు నాయకులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో కిష్టారెడ్డిపేట పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

# కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌లో వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ సమీక్ష

**మన మీ వార్త అక్టోబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌లో కార్మికులు, పరిశ్రమలకు అవసరమైన వసతుల కల్పనపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని సమీక్ష నిర్వహించారు.

పార్క్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలు, కార్మికులకు కల్పించాల్సిన వసతులు, సంబంధిత అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారుల తో సమీక్షించారు.
ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్,వరంగల్ ఆర్డీవో సుమ,నర్సంపేట ఆర్డీవో ఉమారాణి,సంగెం తహసిల్దార్ రాజ్ కుమార్,ఆర్టీసీ డి.ఏం ధరమ్ సింగ్, జోనల్ మేనేజర్ స్వామి మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కళ్ళముందు కనిపించే దేవుళ్ళు వైద్యులు

(మన మీ వార్త న్యూస్) అక్టోబర్ 24, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-





వైద్య నిపుణులు తమ వృత్తులలో ఎదురయ్యే ప్రమాదాలను నివారించుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ జీవిఎన్ భారత లక్ష్మీ తెలిపారు. అనారోగ్యంతో డాక్టర్ల దగ్గరకు వస్తున్న, వెళుతున్న ప్రతి పేషంట్ వృత్తిలో ఒక అనుభవసారమేనని ఆమె అన్నారు. నిజామాబాద్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని సమావేశపు హాల్ లో "ఆరోగ్య సంరక్షణ నిపుణులు, క్లినికల్ సంస్థల(హింస నివారణ) బిల్ -2025 మెడికల్ డాక్యుమెంటైజేషన్ "అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని సహచర అదనపు జిల్లాజడ్జిలు సుగాలి నారాయణ, దారావత్ దుర్గా ప్రసాద్, అదనపు పోలీస్ కమిషనర్ శుభం ప్రకాష్, ట్రైని కలెక్టర్ సురేష్,డిస్ట్రిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆపీసర్ రాజశ్రీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల విశాల్, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్ల సుభాష్ రెడ్డి, డిసిహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ లతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం ఆమె వైద్యులనుద్దేశించి ప్రధానోపన్యాసం చేశారు.ఆసుపత్రులకు వచ్చిన రోగుల రికార్డులను జాగ్రత్తగా నమోదు చేసుకొని కాపాడుకోవాలని అన్నారు. వైద్యులుగా మనసుపెట్టి వైద్యం చేశాము అన్నది ముఖ్యమే అయిన దానికంటే ముఖ్యం రోగికి సంబందించిన వైద్య రికార్డులు మెయింటైన్ చేసుకోవాలని జిల్లాజడ్జి భారత లక్ష్మీ పేర్కొన్నారు. వైద్య వృత్తిలో తప్పటడుగులు వేయరాదనీ చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సుతిమెత్తని హెచ్చరికలతో కూడిన జాగ్రత్తలు ఉద్బోదించారు.రోగులకు వైద్యం చేయడంలో వైద్యుల పొరపాటు ఉంటే వినియోగ దారుల వివాదాల కమిషన్ లో నష్ట పరిహార దావాలను ఎదుర్కొనే ప్రమాదం పొంచి ఉంటుందని ఆమె తెలిపారు. ప్రయివేట్ వైద్యులైన ప్రభుత్వ వైద్యులైన రోగులకు సంబందించిన ప్రతి విషయాన్ని రికార్డు చేయాలని విన్నవించారు.డాక్టర్లు కళ్ల ముందు కనిపించే దేవుళ్ళు అని ఆరోగ్య కాపాడే విషయంలో నిర్లక్షానికి తావు ఇవ్వరాదని సూచించారు.సాంకేతిక యుగంలో సిసి టివి కెమెరాలు, స్మార్ట్ ఫోన్స్ ఉన్నవేళలో జాగ్రత్తగా ఉండాలని మనల్ని ఎవరు గమనిస్తలేరు అనుకోరాదనీ ఆమె అన్నారు.వైద్యులు జారిచేసే డాక్యుమెంట్ చాలా ముఖ్యమైనదని ఒకవేళ కోర్టులలో సాక్ష్యాలు చెప్పడానికి వస్తే ఒరిజినల్ డాక్యుమెంట్స్ కాకుండా ధృవీకరించిన డాక్యుమెంట్స్ తీసుకుని రావాలని అన్నారు."మరణపు చివరి అంచుల మీద ఉన్న వారి మరణ వాంగ్మూలాలకు చాలా విలువ ఉంటుందని అలాంటి వారి రికార్డులు భద్రపరచడంలో లోటుపాట్లు ఉండరాదనీ " తెలిపారు.మెడికల్ రికార్డులు లేకుండా ట్రీట్మెంట్ చేయరాదని అలా చేస్తే చట్టం అనేది ఉన్నదని తెలుపుతు పిడుగు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రిమినల్ కేసులలో, మోటారు రోడ్డు ప్రమాద నష్ట పరిహార కేసులలో డాక్టర్లు కోర్టులలోకి వచ్చి సాక్ష్యం చెబుతారని కాని చాలా తెలివైన న్యాయవాదుల క్రాస్ ఎగ్జామినేషన్ ను తట్టుకోవడం అంత సులువు కాదని అందుకే మెడికల్ రికార్డులు క్రమ పద్దతిలో రాసుకోవాలని అయిన ముప్పు ముంగిట ఉన్నట్లేనని అన్నారు.అడ్మినిస్ట్రేషన్ అఫ్ జస్టిస్ సిస్టమ్ లో నాలుగు స్థంబాలు పోలీసులు, డాక్టర్లు, న్యాయవాదులు ప్రాసిక్యూషన్, న్యాయస్తానాలు అని ఆమె తెలిపారు. వైద్యుల విలువైన పాత్ర బాధితులకు వారి కుటుంబాలకు మరెంతో విలువైనదని ఆమె విశ్లేశించారు.నేటి నుంచి నూతన వైద్య ప్రయాణానికి శ్రీకారం చుట్టుకుని ప్రయాణించాలని జిల్లాజడ్జి భారత లక్ష్మీ కోరారు. జిల్లా కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఈలా త్రిపాఠి మాట్లాడుతూ వ్యవస్థలో వైద్యుల బాధ్యతే ఎక్కువని ఆరోగ్యకరమైన సమాజానికి వెన్నుదన్నుగా నిలవాలని కోరారు."ప్రజల నుండి కలెక్టర్ రావాలి.. కలెక్టర్ రావాలి అనే నినాదాలు వస్తున్నాయి" అవి ఎందుకు వస్తున్నాయో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వైద్యులు ఆలోచించాలని అన్నారు. సమాజం వైద్యుల నుండి చాలా ఆశిస్తుందని అందుకు తగ్గట్లుగా కలిసి పని చేద్దామని ఆమె తెలిపారు. రెండవ అదనపు జిల్లాజడ్జి సుగాలి నారాయణ లీగల్ ప్రొటెక్షన్ అఫ్ డాక్టర్స్ అనే అంశంపైన వివరిస్తూ చట్టం ఎంత కాపాడలో అంత కాపాడుతుందని శృతి మించితే నష్టం తప్పదని తెలిపారు. నాల్గవ అదనపు జిల్లాజడ్జి దారావత్ దుర్గా ప్రసాద్ మెడికల్ డాక్యుమెంటేషన్ అండ్ ప్రొఫెషనల్ నెగ్లీజెన్సీ అంశంపై మాట్లాడుతూ వైద్యుల డాక్యుమెంట్లకు సాక్ష్యాలకు చాలా విలువ ఉన్నదని అన్నారు. ఇన్ పెషేంట్, ఔట్ పెషేంట్ ఆరోగ్యస్థితిగతులతో పాటు ఆరోగ్య పరీక్షలు, మెడిసిన్స్ ఉపయోగం వివరాల నమోదు రక్షణ కీలకమని అన్నారు.మెడికల్ లీగల్ కేసులలో క్లినికల్ రిపోర్టులు సరిగా ఉండే విదంగా చూసుకోవాలని అదనపు పోలీస్ కమిషనర్ శుభం ప్రకాష్ అన్నారు. పెషేంట్ కు డాక్టర్ కు మధ్య చక్కని సంబంధాలే ట్రీట్మెంట్ కు గీటురాయిగా ఉండాలని తెలిపారు. క్రిమినల్ నెగ్లీజెన్సీ పనికిరాదని సిసి టివి తప్పనిసరిగా ఆసుపత్రులలో ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.డిఎమ్ హెచ్ ఒ రాజశ్రీ ఆసుపత్రుల తీరుతేన్నులను తెలిపారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ముద్దసాని నీలిమ కార్యక్రమానికి సంధానకర్తగా వ్యవహారించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి క్షత్రి ఉషా రాణి, సీనియర్ సివిల్ జడ్జిలు అజయ్ ఉల్లం, చైతన్య అంగరి,నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్ల సుభాష్ రెడ్డి,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల విశాల్, డాక్టర్ దీపక్ రాథోడ్, న్యాయసేవ సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేధార్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మహమ్మద్ షాదుల్ల, డాక్టర్లు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వార్షిక తనిఖీలు.







- పోలీసింగ్ వ్యవస్థ మరింత పటిష్టం కావాలని దిశానిర్దేశం
- ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా సమగ్ర సమీక్ష
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర నిఘా వ్యవస్థల వినియోగంపై ప్రత్యేక దృష్టి
- సిబ్బంది పనితీరు, స్టేషన్ నిర్వహణపై కీలక సూచనలు

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 24 :

హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం గారు వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం సందర్శించారు. స్టేషన్‌కు విచ్చేసిన కమిషనర్‌కు హుజూరాబాద్ ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ పూలమొక్కను అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాల గౌరవ వందనాన్ని సీపీ స్వీకరించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని పలు విభాగాలను, రికార్డులను కమిషనర్ సమగ్రంగా పరిశీలించారు. సిబ్బంది, వారి విధులు, క్షేత్రస్థాయి పనితీరును అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మరింత పారదర్శకత, వేగం పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, కేస్ ప్రాపర్టీ భద్రత, రికార్డుల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని పేర్కొంటూ, స్టేషన్ పరిధిలోని అన్ని నిఘా కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అలాగే పెట్రోలింగ్ వాహనాలు, ఆధునిక పరికరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఉపయోగంలో లేని పాత సామాగ్రిని కమిషనరేట్‌కు తరలించి స్టేషన్ ప్రాంగణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందిస్తూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్సైలు మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## హన్మకొండ భువనేశ్వర్ అర్బన్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కూడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి






మన మీ వార్త అక్టోబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్ నగరానికి అవార్డు శనివారం భువనేశ్వర్‌లో నిర్వహించిన అర్బన్ కాన్‌క్లేవ్‌లో హన్మకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కూడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, కుడా పి ఓ అజిత్ రెడ్డి పాల్గొన్నారు

ఈ సందర్భంగా... నగరాల అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై నిర్వహించిన వివిధ ప్యానెల్ చర్చల్లో పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ నగరానికి అవార్డు లభించింది.

జిల్లా కలెక్టర్,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, కూడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి ఈ అవార్డును అందుకున్నారు.

జిల్లా కి లభించిన ఈ గుర్తింపు.

..అభివృద్ధి దిశగా చేపడుతున్న కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్నిస్తుంది.

## ప్రభుత్వ శాఖల నిర్మాణాలకు ఆమోదిత ఇసుకను మాత్రమే వాడాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా , అక్టోబర్ 24(మన మీ వార్త)



జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణాలన్నింటికీ ప్రభుత్వ ఆమోదిత ఇసుక మాత్రమే వినియోగించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, వివిధ శాఖల అభివృద్ధి పనులు, నిర్మాణాలలో ఇసుక వినియోగంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి పనికి చట్ట ప్రకారం మాత్రమే ఇసుకను పొందాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడే విధంగా ఇతర మార్గాల్లో ఇసుక సేకరించి వాడటాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని అన్నారు. నిర్మాణ పనులకు ఇసుకను పొందే మార్గాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. నాసిరకం ఇసుక వాడటం వల్ల నిర్మాణాల్లో నాణ్యత లోపాలు తలెత్తుతాయని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కూడా పారదర్శకంగా ఇసుక పొందాలని చెప్పారు. ఆయా నిర్మాణ పనుల్లో ఇసుక కొరత తలెత్తకుండా చూడాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, మైనింగ్ అధికారి తిరుపతి రావు, ఆర్ అండ్ బి, నీటిపారుదల శాఖల ఈఈ లు సుభాష్, అనిల్, హౌసింగ్ పిడి శ్రీనివాస్, సిపిఓ గంగారెడ్డి, ఈడబ్ల్యుఐడిసి డిప్యూటీ ఈఈ గంగాధర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వే పనులపై అధికారులకు క్షేత్రస్థాయి శిక్షణ

- కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యక్షంగా రోవర్ తో ప్రత్యక్షంగా రిసర్వే శిక్షణా కార్యక్రమం

మన మీ వార్త అక్టోబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులకు క్షేత్రస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని శనివారం వరంగల్ కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్, ఏ.డి సర్వేస్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, వరంగల్ , నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణిలు రోవర్ తో రిసర్వే పై శిక్షణ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా భూ రీసర్వేకు సంబంధించిన విధివిధానాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై రోవర్ తో ప్రత్యక్షంగా రీ సర్వేను ఎలా చేయాలో ఆర్డీవోలకు, వివిధ తహసీల్దార్లకు శిక్షణ నిర్వహించారు.
భూ రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక అంశాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ పొందారు.
ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ సర్వే సెటిల్‌మెంట్స్ మరియు ల్యాండ్ రికార్డ్స్ విభాగం కమిషనర్ రాజీవ్ గాంధీహనుమంత్

- తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శిగా లోకేష్ కుమార్

మన మీ వార్త అక్టోబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





శనివారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రీసర్వే ప్రక్రియ పురోగతి, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులు తదితర అంశాలపై సమీక్షించారు.
భూ రీసర్వే జరుగుతున్న విధి విధానాల పై సమీక్ష నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, డియార్వో విజయలక్ష్మి సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి 163జీ పనులపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

- సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం



మన మీ వార్త అక్టోబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జాతీయ రహదారి 163జీకి సంబంధించిన పనుల పురోగతిపై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జాతీయ రహదారికి సంబంధించిన పనుల ప్రస్తుత స్థితి, వివిధ శాఖల సమన్వయం, పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఈ సమీక్ష లో జిల్లా ఫారెస్ట్ అధికారి నిఖిత, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్, డియార్వో విజయలక్ష్మి,వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అరుంధతీయ బంధు సేవ మండలి 44 వ వార్షికోత్సవ వేడుకలు.



-తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి వారిలో సి. దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారు

మెదక్ అక్టోబర్ 24 మన మీ వార్త ప్రతినిధి.

మెదక్ జిల్లా నుండి అరుంధతీయ బంధు సేవా మండలి ఆధ్వర్యంలో దసరా మిలాప్ 44 వ వార్షికోత్సవ వేడుకలకు రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు అందరు వస్తారన్నారు. గత 44 సంవత్సరాలుగా ఈ యొక్క కార్యక్రమం అంచలంచెలుగా హైదరాబాదులో మొదలుకొని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇరు రాష్ట్రాల బంధుమిత్రులు



దసరా తర్వాత మొదటి ఆదివారం ప్రతి సంవత్సరం నిర్వహించడం ఆనవాయితీగా నిర్వహిస్తారు.

మెదక్ జిల్లా అధ్యక్షునిగా పెద్దింటి సత్యం దళితులపై దాడిని ఖండిస్తూ మంత్రికి అందజేస్తున్నట్లు తెలిపారు.

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కొనాయపల్లి పిటి కూచారం గ్రామాలలో దళిత మహిళ సర్పంచితో బతుకమ్మ ఆడితే వారి ఆడవారి విలువలు తగ్గుతాయని అవమానపరిచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అలాగే కొనాయపల్లి గ్రామంలో బతుకమ్మ పండుగ రోజు వెయ్యి రూపాయలు ఎక్కువ ఇవ్వమని అడగడంతో వేరే ఊరి నుండి వారి కులస్తులను పిలిపించి బ్యాండ్ కొట్టినచో మాదిగ కులస్తులు మీరు వేరే ఊరు నుంచి వచ్చి మా కులవృత్తిని మీరు చేయొద్దని తెలపడంతో వారు బ్యాండ్ కొట్టకపోవడంతో సర్పంచ్ కళ్యాణ్ మాదిగ లంజా కొడుకులకు బాగా బలుపు వచ్చిందని ఇష్టం వచ్చిన బూతు మాటలు తిట్టి కట్టెలతో కొట్టి తొమ్మిది మందిని గాయపరిచారని పారిశు



ద్ధ కార్మికురాలపై కూడా దాడి కర్రలతో దాడి చేశారని తెలపడంతో వారిపై డిఎస్పి విచారణ శుక్రవారం చేశారు అక్కడ జరిగిన సంఘటనను క్షుణ్ణంగా విచారించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

-మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్ దాడి చేసిన వారికి సహకరిస్తున్నందుకు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకువస్తామని తెలిపారు.

అన్ని దళిత సంఘాల నాయకులు గ్రామానికి వచ్చి జరిగిన దాడిని బాధితులను అడిగి తెలుసుకుంటున్నారు. వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు.

# జనగామ యాసంగి 2026--27 లో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

మన మీ వార్త అక్టోబర్ 24 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

శనివారం, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సూచనల మేరకు, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు విత్తనాల డీలర్లు, మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల డీలర్లతో యాసంగి సాగు సలహాలపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. జొన్న, వేరుశనగ, మినుము, పెసర, నువ్వులు, పొద్దుతిరుగుడు, శనగ, కుసుమ వంటి ఆరుతడి పంటలతో పాటు కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకొని రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. మార్కెట్లో ఆరుతడి పంటలకు మంచి ధరలు లభించే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లకు సూచనలురైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలను అందించేందుకు డీలర్లు ప్రభుత్వ నిబంధనలను



తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

- నకిలీ విత్తనాలను విక్రయించరాదు. అనుమతులు కలిగిన, లేబుల్‌పై అవసరమైన వివరాలు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలి.
- విత్తనాలను ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదు.
- కాలపరిమితి ముగిసిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదు.
- విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలు, విక్రయాలు మరియు సంబంధిత రికార్డులను నిబంధనల ప్రకారం నిర్వహించాలి.
- రైతులకు సరైన వ్యవసాయ సూచనలు అందిస్తూ



నాణ్యమైన ఉత్పాదకాలను సరైన ధరలకు అందుబాటులో ఉంచాలి.

రాబోయే యాసంగి సీజన్‌లో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులు ఆర్థికంగా లాభపడేలా వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు డీఆర్‌డీఓ అధికారి నూరుద్దీన్, జనగామ, ఘనపూర్ (స్టేషన్), పాలకుర్తి ఏడీఏలు అపర్ణ, వసంత సుగుణ, మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల మహిళా డీలర్లు, 190 మంది ప్రైవేటు విత్తన డీలర్లు, తదితరులు పాల్గొన్నారు

# గ్రామగ్రామాన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించాలి

- వాల్మీకి బోయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు ఉమ్మల్ల రాములు పిలుపు
- అక్టోబర్ 26న వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా జరుపుకోవాలి

వనపర్తి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 మీ వార్త :

వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన (సోమవారం) గ్రామాలు, పట్టణాల్లోని ప్రజలందరూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వాల్మీకి బోయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు ఉమ్మల్ల రాములు పిలుపునిచ్చారు.మహర్షి వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి, ప్రపంచానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవీయ విలువలను చాటిచెప్పిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని తెలిపారు.వాల్మీకి మహర్షి ఆశయాలను, బోధనలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన జయంతి వేడుకలను కేవలం ఒక ఉత్సవంగా కాకుండా, మహర్షి ఆశయాలను స్మరించుకునే పర్వదినంగా జరుపుకోవాలని సూచించారు.



**యువతలో చైతన్యం కల్పించాలి...**

గ్రామాలు, పట్టణాల్లోని వాల్మీకి బోయ సంఘాల నాయకులు, యువకులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ముందుకు వచ్చి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఉమ్మల్ల రాములు కోరారు. మహర్షి వాల్మీకి జీవిత చరిత్ర, ఆయన సాహిత్య సేవలు, సమాజానికి అందించిన సందేశాన్ని ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఐక్యతను చాటాలని, భావితరాలకు ఆయన గొప్పతనాన్ని తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పీఎం రాహత్ పథకంను సద్వినియోగం చేసుకోవాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**నిజామాబాద్** : రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించడంలో పీఎం రాహత్ పథకం కీలకంగా నిలుస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ ఆక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలిజేషన్ అండ్ అస్యూర్డ్ (ట్రీట్మెంట్) పథకం అమలుపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సీ.ఎస్ సంజయ్ జాజు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుసంధానం, నిధుల విడుదల ప్రక్రియపై చర్చించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని ఆసుపత్రిలో చేర్పించడానికి పోలీస్ ఆమోదిత కేసులకు గరిష్టంగా 1 లక్షా 50 వేల రూపాయల వరకు పూర్తి చికిత్స అందించే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత బాధితుల ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఈ సమయంలో వేగంగా స్పందించాలని అన్నారు. ఈ పథకం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా కలెక్టర్లు రహదారి భద్రత కమిటీలతో సమన్వయం చేసుకొని, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు, బాధితుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయడానికి టీఎంఎస్



2.0 పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా బాధితుల చికిత్స ఖర్చులను నేరుగా ఆసుపత్రులకు చెల్లించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలలో ఈ పథకంపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి జిల్లాలోనూ ఈ పథకం అమలును కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు పలు సూచనలు చేశారు. పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతం గా అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత శాఖలు వెంటనే




అప్రమత్తమవ్వాలని అన్నారు. నగదు, బాదితుల సమాచారం అందుబాటులో లేని కారణంగా వైద్యసేవలు నిరాకరించకూడ దన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఉండి ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ నష్టాలను తగ్గించాలని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ లు రాజాగౌడ్, భుజంగరావు, జిల్లా రవాణా శాఖ అధికారి రమేష్ రాథోడ్, వైద్యా రోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఈ-దార్ జిల్లా మేనేజర్ వర్ష నిహంత్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల విధులు, సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన



మీ వార్త సూర్యాపేట అక్టోబర్ 24: జిల్లా ప్రతినిధి

పోలీస్ ఫ్లాగ్ డే, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఆధ్వర్యంలో పోలీసుల విధులు, నేరాల దర్యాప్తు, క్లూస్ టీమ్, ఫింగర్‌ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ పనితీరును విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల నివారణ, మహిళలు, బాలికల రక్షణపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమాజ శాంతి కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను ప్రతి విద్యార్థి, పౌరుడు గుర్తుంచుకోవాలని కోరారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఫింగర్‌ప్రింట్స్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, భరోసా ఎస్ఐ మౌనిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్‌పహాడ్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

- మూసి ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ కాలువకు అనుసంధానం చేయాలి: లకావత్ వీరన్న నాయక్

మీ వార్త అక్టోబర్ 24 సూర్యాపేట జిల్లా ప్రతినిధి



పెన్‌పహాడ్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని లంబాడి విద్యార్థి సేన సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు లకావత్ వీరన్న నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని పంట నష్టంపై అధికారులు సమగ్ర సర్వే నిర్వహించాలని కోరారు. అలాగే మూసి ప్రాజెక్టు నుంచి ఎస్సారెస్పీ కాలువకు అనుసంధానం చేసి పెన్‌పహాడ్, చివ్వెంల, ఆత్మకూర్, సూర్యాపేట రూరల్ మండలాలకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సాగునీటి సమస్య పరిష్కారం కోసం నాలుగు మండలాల రైతులతో కలిసి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు హుస్సేన్ నాయక్, రాంబాబు నాయక్, గిరి నాయక్, కోటియ నాయక్, జగదీష్, సాయి, యశ్వంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రావెల్లిలో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు..

- ఆక్రమణలను సహించేది లేదు: తూప్రాన్ తహసీల్దార్.

తూప్రాన్/ మనోహరాబాద్, అక్టోబర్ 24, మన మీ వార్త ప్రతినిధి.





ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తూప్రాన్ తహసీల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా తూప్రాన్ మండలం రావెల్లి గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం అధికారుల ఆదేశాల మేరకు తొలగించారు.

రావెల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 235 లో, గీతారెడ్డి కాలనీ ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, నిబంధనల మేరకు శిక్షలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. తూప్రాన్ మండల పరిధిలోని ఏ గ్రామంలోనూ ప్రభుత్వ భూములను ఆక్రమించరాదని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ శాఖ నిరంతరం చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ అక్రమ నిర్మాణాల తొలగింపు కార్యక్రమంలో తూప్రాన్ గిర్దవర్‌తో పాటు జీపీఓలు నాగరాజు, బాబు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా నడుస్తున్న పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కార్యక్రమం

- పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న మాజీ
- వ్యవసాయ మార్కెట్ చైర్మన్,ఎమ్మెల్సీ ఎన్నికల
- పరకాల నియోజకవర్గ కోఆర్డినేటర్ చందుపట్ల రాజి రెడ్డి

పరకాల ప్రతినిధి మన మీ వార్త :



పరకాల పట్టణంలోని క్యాంప్ ఆఫీస్ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత,పరకాల శాసనసభ్యులు గౌరవ రేవూరి రెడ్డి ఆదేశాల మేరకు పరకాల పట్టణం,పరకాల మండలం,నడికుడ మండలంలోని పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది ఇట్టి నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ కోఆర్డినేటర్ చందుపట్ల రాజి రెడ్డి గారు మరియు వారితో పాటుగా పరకాల పట్టణ అధ్యక్షులు ఒంటేరు శ్రావణ్ కుమార్,పరకాల మండల అధ్యక్షులు కోలెపాక చందు,నడికుడ మండల అధ్యక్షులు పర్నెం మల్లారెడ్డి,సోషల్ మీడియా నియోజకవర్గ కోఆర్డినేటర్ రాయుడు జీవన్ రెడ్డి,పరకాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మటి కృష్ణ కాంత్,పరకాల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ అల్లం శ్రీరామ్,పరకాల టౌన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం శివకుమార్,క్లస్టర్ ఇంచార్జిలు కొత్తపెల్లి రవి,రాము,మచ్చ సుమన్ మరియు క్లస్టర్ ఇంచార్జిలు, బిఎల్ఎ లు తదితరులు పాల్గొన్నారు.

# క్రిప్టో ఆస్తులు, ఏఐపై ప్రత్యేక దృష్టి

దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సమగ్ర అధ్యయనం చేపట్టనుంది. క్రిప్టో ఆస్తులు, ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, కరెన్సీ నిర్వహణ, బ్యాంకింగ్, బీమా, పన్నుల సంస్కరణలు సహా మొత్తం 46 అంశాలను 2026–27 ఆర్థిక సంవత్సరంలో పరిశీలనకు ఎంపిక చేసింది. ఈ అంశాలపై అధ్యయనం చేసి నివేదికలు సిద్ధం చేయనున్నట్లు లోక్‌సభ బులెటిన్ వెల్లడించింది.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ నెల ప్రారంభంలో వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ కమిటీలను పునర్వ్యవస్థీకరించారు. ఈ క్రమంలో ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘానికి బీజేపీ ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను మరోసారి ఛైర్మన్‌గా నియమించారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాలు, వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థలు, పెట్టుబడులు–ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, రెవెన్యూ, ఆర్థిక సేవల విభాగాలతో పాటు మరికొన్ని కీలక సంస్థలకు సంబంధించిన అంశాలను కమిటీ పరిశీలించనుంది. ధరల స్థిరత్వం, రూపాయి విలువ, ఆర్థిక నియంత్రణ వ్యవస్థలు, ప్రభుత్వ ఆస్తుల వినియోగం వంటి అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఆయా రంగాల్లో విధానాల అమలు, పనితీరు, సంస్కరణల అవసరాన్ని అంచనా వేయడం ఈ అధ్యయనాల ప్రధాన ఉద్దేశం.

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వర్చువల్ డిజిటల్ ఆస్తులపై కమిటీ ప్రత్యేకంగా అధ్యయనం చేయనుంది. క్రిప్టో ఆస్తులకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, వాటి భవిష్యత్తు, ఈ రంగంలో అనుసరించాల్సిన విధానాలపై పరిశీలన చేపట్టనుంది. ఆర్థిక రంగంలో కృత్రిమ మేధ వినియోగం వల్ల కలిగే అవకాశాలు, ఎదురయ్యే సమస్యలను కూడా అధ్యయనం చేయనుంది. బ్యాంకింగ్,



ఆర్థిక సేవలు, డిజిటల్ లావాదేవీలు వంటి విభాగాల్లో కొత్త సాంకేతికత వినియోగం పెరుగుతున్నందున సంబంధిత అంశాలపై సమగ్ర విశ్లేషణకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అదే సమయంలో ఆర్థిక రంగంలో నియంత్రణ వ్యవస్థల పనితీరు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో ఉన్న నియంత్రణ లోపాలను పరిశీలించనుంది. ఈ రంగాల్లో తగిన పర్యవేక్షణ, పారదర్శకతకు సంబంధించిన అంశాలపై కూడా నివేదిక రూపొందించనుంది.

**ధరల స్థిరత్వం కరెన్సీ నిర్వహణ**

దేశ ఆర్థిక వ్యవస్థలో ధరల స్థిరత్వం, కరెన్సీ నిర్వహణ కీలక పాత్ర పోషిస్తాయి. వీటికి సంబంధించి అనుసరిస్తున్న వ్యూహాలు, ఎదురవుతున్న సవాళ్లను కమిటీ సమీక్షించనుంది. మారుతున్న స్థూల ఆర్థిక పరిస్థితులను విశ్లేషించడంతో పాటు భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) పాత్రను కూడా పరిశీలించనుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల పనితీరు, ఆర్థిక వ్యవస్థలో వాటి ప్రాధాన్యం వంటి అంశాలపై అధ్యయనం చేపట్టనుంది. ప్రభుత్వ రంగ ఆస్తుల నగదీకరణ ద్వారా వనరులను సమర్థంగా వినియోగించుకునే విధానాలనూ పరిశీలించనుంది. ఇక బ్యాంకింగ్, పెన్షన్, ఆరోగ్య బీమా రంగాల పనితీరుతో పాటు అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక భద్రత కల్పించే అంశాలపైనా కమిటీ దృష్టి సారించనుంది. కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల అమలు, ఫలితాలను సమీక్షించనుంది.

**జీఎస్టీ, ప్రత్యక్ష పన్నుల సంస్కరణలు**

పన్నుల విధానంలో మార్పులు, సంస్కరణలకు సంబంధించిన అంశాలు కూడా కమిటీ పరిశీలనలో ఉన్నాయి. కస్టమ్స్ సుంకాలు, వస్తు–సేవల పన్ను (జీఎస్టీ), ప్రత్యక్ష పన్నుల వ్యవస్థల్లో చేపట్టాల్సిన మార్పులపై అధ్యయనం చేయనుంది. పన్నుల విధానాలు ఆర్థిక కార్యకలాపాలు, ప్రభుత్వ ఆదాయంపై చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్కరణల అవసరాన్ని అంచనా వేయనుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) పనితీరును కూడా సమీక్షించనుంది. ఆర్థిక మార్కెట్ల నియంత్రణ, పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణ వంటి అంశాలు ఈ పరిశీలనలో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది.

**కంపెనీల నిర్వహణ, ఆడిటర్ల బాధ్యతలు**

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయ కంపెనీ చట్ట ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై కమిటీ అధ్యయనం చేయనుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్), కంపెనీల ఈ–గవర్నెన్స్, ఆడిటర్ల జవాబుదారీతనం వంటి అంశాలను కూడా పరిశీలించనుంది. కంపెనీల పాలనలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ అధ్యయనాలు ఉపయోగపడే అవకాశం ఉంది.

**నీతి ఆయోగ్, ఆర్థిక గణాంకాలపై సమీక్ష**

రంగాలవారీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో నీతి ఆయోగ్ పాత్రను కమిటీ పరిశీలించనుంది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం పనితీరును కూడా సమీక్షించనుంది. గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయ ఖాతాల గణాంకాలపై అధ్యయనం చేపట్టనుంది. దేశ ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి అవసరమైన గణాంకాల సేకరణ, విశ్లేషణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించనుంది.

# రాహుల్ ఓట్ చోరీ ర్యాలీ సిక్కుల గాయాలపై కారం చల్లడమే

1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల గాయాలపై కారం చల్లే ఉద్దేశంతో దిల్లీలో నవంబరు 1న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరసన ర్యాలీకి పిలుపునిచ్చారని బీజేపీ ఆరోపించింది. ర్యాలీ నిర్వహణపై ఇండి కూటమిలోని పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేదని విమర్శించింది. ర్యాలీ వాయిదా వేయాలని కోరుతున్నప్పటికీ, ఎవరు చెప్పినా రాహుల్ మాట వినడం లేదని దుయ్యబట్టింది. తన పంతం నెగ్గించుకునేందుకు రాహుల్? ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. సిక్కు సమాజం మనోభావాలను పట్టించుకోవడం లేదనేదే కాంగ్రెస్ సందేశమని ఆయన ఆరోపించారు. దిల్లీ పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**'సీఈసీని పదవినుంచి తొలగించాలి'**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్?ఐఆర్?)లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చలో దిల్లీ పేరిట నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి భారీ ర్యాలీ తలపెట్టనుంది. ఓటు చోరీకి వ్యతిరేకంగా దాదాపు 10 లక్షల మందితో ఈ నిరసన కవాతు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్? కుమార్(సీఈసీ)ను పదవి నుంచి తొలగించాలని



డిమాండ్ చేస్తూ ర్యాలీ తలపెట్టనున్నట్లు పేర్కొంది. ఆ ర్యాలీలో జనం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఇప్పటికే సీఈసీకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించడంతో పాటు, పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ప్రదర్శనగా వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రతిపక్ష నేతలు కలిశారు.

**ర్యాలీతో చిరువ్యాపారులకు ఇబ్బందులు**

పండుగ సీజన్ వేళ దిల్లీలో ర్యాలీ తలపెట్టడం వల్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో జరగాల్సిన పార్టీ ర్యాలీని నవంబర్ 10 తర్వాతకు వాయిదా వేయాలని కోరుతూ ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) శనివారం రాహుల్ గాంధీకి లేఖ రాసింది. లేఖలో, ఈ ఏడాది నవంబర్ 10న వచ్చే భాయ్ దూజ్ తర్వాత మరో తేదీకి ర్యాలీని వాయిదా వేయాలని సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ అభ్యర్థించారు. ధంతేరస్, దీపావళి, భాయ్ దూజ్ పండుగలు దిల్లీ రిటైల్ మార్కెట్లకు అత్యంత అనువైన సమయమని వ్యాపారుల సంఘం పేర్కొంది. ఆ సమయంలో వ్యాపారులు పండుగ కొనుగోళ్లు, అమ్మకాలను చాలా ముందుగానే ప్రారంభిస్తారని నొక్కి చెప్పింది. బంగారం, వెండి, పాత్రలు, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, ఆటోమొబైల్స్, ఫర్నిచర్ ఇతర వస్తువుల వంటి రంగాలను కలుపుకొని, కేవలం ధంతేరస్ సందర్భంగానే దిల్లీలో సుమారు రూ. 25,000 కోట్ల విలువైన వ్యాపారం జరుగుతుందని అంచనా వేసింది.

**ఇందిరా గాంధీ హత్యతో సిక్కు వ్యతిరేక అల్లర్లు**

ఇదిలా ఉండగా, 1984 అక్టోబర్ 31న అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హత్యకు గురైన తర్వాత, దిల్లీతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి. చాలా మంది బాధితులు అల్లర్లలో తీవ్రంగా గాయపడ్డారు.

# భారత్‌లో వారిని చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి

**ఆ జ్ఞాపకాలు ఎప్పుడూ నాతోనే ఉంటాయి**

**పోలాండ్ ప్రధాని**

**దృష్టిలోపం ఉన్న చిన్నారులను సంరక్షిస్తున్న కేంద్రానికి వెళ్లిన డొనాల్డ్ వారిని చూసి చలించిపోయారు.**

'జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, పరిస్థితులు ఎంతలా మారినా మదిలోని కొన్ని జ్ఞాపకాలు మాత్రం ఏళ్ల తరబడి మనతోనే ఉంటాయి. ఏ కాలం ఏ విధి వాటిని మన నుంచి దూరం చేయలేవు' అని అంటారు. సరిగ్గా పోలాండ్? ప్రధానమంత్రి డొనాల్డ్ టుస్క్‌కి అదే జరిగింది. ఇటీవల భారత పర్యటనకు వచ్చిన ఆయనకు ఓ మధురాతి అనుభవం ఎదురైంది. 16 సంవత్సరాల క్రితం భారత్?ను సందర్శించినపుడు జరిగిన భావోద్వేగభరితమైన సంఘటనను ఆయన గుర్తుచేసుకున్నారు.

**ఇంతకీ అదేంటంటే!**

ఫ్రాన్స్, పోలండ్‌కు చెందిన కొంతమంది ఏర్పాటుచేసిన అంధుల సంరక్షణ కేంద్రాన్ని 16 ఏళ్ల క్రితం బెంగళూరు పర్యటనకు వచ్చిన డొనాల్డ్ టుస్క్ సందర్శించారు. దృష్టిలోపం ఉన్న చిన్నారులను సంరక్షిస్తున్న కేంద్రానికి వెళ్లిన డొనాల్డ్ వారిని చూసి చలించిపోయారు. తాజాగా మళ్లీ భారత్ పర్యటనకు వచ్చిన టుస్క్ మరోసారి ఆ కేంద్రాన్ని సందర్శించారు. పోలండ్ జాతీయగీతంలోని పదాలను పిల్లలు గుర్తుంచుకోవడాన్ని చూసి టుస్క్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాసేపు ఆ పిల్లలతో ముచ్చటించారు. అలాగే, అప్పటి వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు.అందులో "సరిగ్గా 16 ఏళ్ల క్రితం ఈ కేంద్రాన్ని పోలండ్ ప్రతినిధి బృందంతో కలిసి నేను ఈ కేంద్రాన్ని సందర్శించాను. ఆ సమయంలో చిన్నారులు మా దేశ జాతీయగీతం పాడటం చూసి ఆశ్చర్యపోయాం. పిల్లలు





పోలిష్ జాతీయ గీతాన్ని పాడినప్పుడు మా కళ్లలో నీళ్లు తిరిగాయి. నేడు వారంతా పెద్దవారయ్యారు. కానీ వారికి ఇప్పటికీ 'మజురెక్ డాబ్రోవ్స్కిగో' (పోలిష్ జాతీయ గీతం)లోని పదాలు గుర్తున్నాయి. ఈరోజు వారిని చూసిన తర్వాత కళ్లలో నీళ్లు తిరిగాయి" అని ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. టుస్క్ పోస్ట్ చేసిన వీడియోలో గులాబీ రంగు దుస్తులు ధరించిన పిల్లలు పోలాండ్ జాతీయ గీతం పాడారు. అనంతరం టుస్క్ వారికి అభినందించి బహుమతులు అందించారు.

**మూడు రోజుల పర్యటనకు భారత్‌కు విచ్చేసిన టుస్క్**

టుస్క్ అక్టోబర్ 21 నుంచి 23 వరకు మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారత్?కు వచ్చారు. అక్టోబర్ 21న దేశానికి చేరుకున్నారు. మరుసటి రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌లను కలిశారు. పలు కీలక విషయాలపై చర్చలు జరిపారు. అనంతరం రెండు దేశాలు కలిసి నాలుగు అంశాలపై ప్రకటన చేశాయి. అందులో వాణిజ్యం రెట్టింపు, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై చర్చలు, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం వంటివి ఉన్నాయి. వీటితో పాటు ఇరుదేశాల మధ్య విస్తృత రక్షణ బంధానికి బాటలు పడ్డాయి. అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లోనూ మరింతగా సహకరించుకోవాలని కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. దీంతోపాటు వాణిజ్యాన్ని ఇప్పుడున్న దానికి రెట్టింపు చేస్తూ 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. పోలండ్‌తో కలిసి రక్షణ, అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లో అభివృద్ధి, తయారీకి కృషి చేయాలని నిర్ణయించామని మోదీ పేర్కొన్నారు. కీలక ఖనిజాలు, బొగ్గు రంగాల్లోనూ సహకరించుకోవాలని అంగీకరించినట్లు చెప్పారు. రష్యా- ఉక్రెయిన్?తో పాటు పశ్చిమాసియాల్లో శాంతి స్థాపనకు జరిగే ఎటువంటి అర్థవంతమైన ప్రయత్నాలకైనా పూర్తి మద్దతిస్తామని మోదీ స్పష్టం చేశారు. భారత్, పోలండ్ దేశాలు ప్రజాస్వామ్య విలువలను నమ్ముతాయని, చట్టాలను గౌరవిస్తాయని అన్నారు. అదే సమయంలో మోదీపై టుస్క్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన తన స్నేహితుడని చెప్పుకోవడం గర్వంగా ఉందని అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జామ్‌నగర్, కొల్హాపూర్ రాజ కుటుంబాలు పోలండ్‌కు చెందిన వేల మంది పిల్లలు, ప్రజలకు ఆశ్రయమివ్వగా, 2022లో ఉక్రెయిన్–రష్యా యుద్ధం ప్రారంభమైనప్పుడు అదే తరహాలో భారతీయులను తరలించేందుకు పోలండ్ సహకరించిందని మోదీ చెప్పారు.

## ఫ్రాన్స్ నిరసనల్లో అరాచకం.. దుకాణాల లూటీ..

ఫ్రాన్స్‌లో ఇటీవల చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో చోటుచేసుకున్న దుకాణాల లూటీ వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. నిరసనకారులు, దుండగులు దోచుకున్న ఖరీదైన లగ్జరీ వస్తువులను ప్రముఖ ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో అమ్మకానికి పెట్టడం తీవ్ర కలకలం రేపుతోంది. దీంతో అప్రమత్తమైన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఈ అక్రమ అమ్మకాలను అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టింది. ఫ్రాన్స్ వాణిజ్య శాఖ మంత్రి సెర్జ్ పాపిన్ ప్రకారం, దేశవ్యాప్తంగా జరిగిన అల్లర్లలో సుమారు 3,000 రిటైల్ దుకాణాలు ధ్వంసం లేదా దోపిడీకి గురయ్యాయి. ముఖ్యంగా పారిస్‌లోని లెస్ హాల్స్ జిల్లాలో ఉన్న హెర్మేస్, లూయిస్ విట్టన్, ది నార్త్ ఫేస్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఫ్లాగ్‌షిప్ స్టోర్లు తీవ్రంగా నష్టపోయాయి. దుకాణాల్లో దోపిడీ జరిగిన కొద్ది గంటల్లోనే, డిజైనర్ హ్యాండ్‌బ్యాగులు, ఖరీదైన సౌందర్య సాధనాలు, కాస్మెటిక్స్ వంటివి వింటెడ్, అమెజాన్, లెబాన్‌కాయిన్ వంటి ఆన్‌లైన్ సైట్లలో అమ్మకానికి ప్రత్యక్షమయ్యాయి. ఈ పరిణామంతో ఫ్రాన్స్ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. వాణిజ్య మంత్రి సెర్జ్ పాపిన్, డిజిటల్ వ్యవహారాల మంత్రి అన్నే లే హెనాఫ్.. వింటెడ్, అమెజాన్, ఈబే, మెటా, టిక్‌టాక్ వంటి సంస్థల ప్రతినిధులతో అత్యవసర వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆయా ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న దొంగసొత్తుకు సంబంధించిన లిస్టింగులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన వింటెడ్, తమ ప్లాట్‌ఫామ్‌పై దొంగిలించిన వస్తువుల అమ్మకాల పట్ల "జీరో టాలరెన్స్" విధానాన్ని అనుసరిస్తామని తెలిపింది. తమ సైట్‌లో అసాధారణ రీతిలో లగ్జరీ వస్తువుల లిస్టింగులు పెరిగినట్లు గుర్తించామని, అధికారులతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొంది. మరోవైపు, ఈబే కూడా తమ వద్ద దొంగసొత్తు అమ్మకాలను నిషేధించామని, అనుమానాస్పద ఖాతాలను గుర్తించేందుకు ప్రత్యేక అల్గారిథమ్‌లు, పరిశోధకుల బృందాలు ఉన్నాయని వెల్లడించింది. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ.. దోపిడీలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఫ్రెంచ్ చట్టాల ప్రకారం, దొంగసొత్తును కలిగి ఉండటం, అమ్మడం లేదా బదిలీ చేయడం వంటి నేరాలకు పాల్పడితే ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు 375,000 యూరోల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

## వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది రోజుల్లో 'అతి తీవ్ర తుపాను'గా మారి రాష్ట్రంపై పెను ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్టోబర్ 28న బాపట్ల–విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీర ప్రాంతాలకు 'ప్రీ–సైక్లోన్ వాచ్' జారీ చేసింది. న్యూఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం శనివారం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ ప్రకారం.. ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 820 కిలోమీటర్లు, కాకినాడకు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం తొలుత దక్షిణ దిశగా కదిలి, అక్టోబర్ 25న తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని పశ్చిమ–వాయవ్య దిక్కుగా ప్రయాణించి మరింత శక్తిని పుంజుకోనుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా, 27 నాటికి తీవ్ర తుపానుగా, 28వ తేదీ ఉదయం నాటికి అతి తీవ్ర తుపానుగా మారుతుంది. అక్టోబర్ 28వ తేదీన ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బాపట్ల–విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ఏర్పడటానికి, అది బలపడటానికి సముద్రంలో పరిస్థితులు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 29–30 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండటం, మాడెన్–జూలియన్ ఆసిలేషన్ (ఎంజేఓ) వంటి వాతావరణ అంశాలు ఈ తుపాను తీవ్రతను పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వాతావరణ నమూనాలు (మోడల్స్) కూడా ఈ తుపాను ఏపీ తీరం వైపే వస్తుందని, అతి తీవ్రంగా మారుతుందని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని నమూనాలు ఒడిశా లేదా తమిళనాడు వైపు సూచించినప్పటికీ, అందుకు అవకాశాలు తక్కువ అని భావిస్తున్నారు. ప్రస్తుత అంచనాల కచ్చితత్వంపై వాతావరణ శాఖ స్పందించింది. తుపాను మార్గం, తీవ్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సమాచారాన్ని అందిస్తామని తెలిపింది. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు, సముద్రపు అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

## మోదీ ఫొటోకు క్షుద్రపూజలు!

ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను ఉపయోగించి, శ్మశానవాటిక సమీపంలో క్షుద్రపూజలు చేస్తున్నట్లు ఉన్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనితో పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. "సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలో, దోరిఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సరయూ నదీ తీరాన ప్రధాని మోదీ ఫొటో చుట్టూ కొబ్బరికాయలు, నిమ్మకాయలు పెట్టారు. నారింజ రంగు పొడితో ముగ్గులు వేసి ఉన్నాయి. ఈ వీడియో ఎక్కడి నుంచి వచ్చిందో ఆరా తీస్తున్నాం. ఘటన జరిగిన ప్రదేశం నుంచి కూడా ఆధారాలు సేకరిస్తున్నాం. అలాగే చుట్టుపక్కల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. గుర్తు తెలియని నిందితులపై భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశాం" అని ఘోసీ సర్కిల్ ఆఫీసర్ సత్యేంద్ర భూషణ్ తివారీ చెప్పారు. నదీతీరాన ప్రధాని ఫొటోను, పూజా సామగ్రిని ఎవరు ఉంచారు సోషల్ మీడియాలో ఈ వీడియో ప్రచారం చేయడం వెనుకున్న వారి ఉద్దేశం ఏమిటి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఢిల్లీలో అత్యుత్తమ గాలి నాణ్యత నమోదు..

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యంపై ప్రభుత్వాలు సాగిస్తున్న పోరాటం సత్ఫలితాలనిస్తోంది. శనివారం నాడు (అక్టోబరు 24) నగరంలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 191 వద్ద 'మోడరేట్' కేటగిరీలో నమోదైందని, ఇది గత దశాబ్ద కాలంలో నమోదైన అత్యుత్తమ గాలి నాణ్యత అని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా ప్రకటించారు. కోవిడ్–19 ప్రభావిత కాలాన్ని మినహాయిస్తే, పదేళ్లలో ఇదే అత్యంత మెరుగైన ఏక్యూఐ అని ఆయన అన్నారు. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం చేస్తున్న నిరంతర పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. గత గణాంకాలను పరిశీలిస్తే, అక్టోబర్ 24న 2024లో ఏక్యూఐ 306గా, 2025లో 275గా నమోదైందని, ఈ ఏడాదది 191కి తగ్గడం గణనీయమైన పురోగతిని సూచిస్తోందని మంత్రి వివరించారు. కాలుష్య నివారణకు చేపట్టిన స్థిరమైన చర్యలు, కఠినమైన అమలు, వివిధ ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయంతో కూడిన జోక్యం వల్లే ఈ సానుకూల మార్పు సాధ్యమైందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేఖా గుప్తా నాయకత్వంలో ఢిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు సమగ్రమైన, కార్యాచరణ–ఆధారిత విధానాన్ని అవలంబిస్తోందని సిర్సా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిబంధనల అమలు, రెగ్యులర్ తనిఖీలు, జిల్లా స్థాయి సమీక్షలు, టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ వంటి బహుముఖ వ్యూహాలతో కాలుష్య కారకాలను మూలాల వద్దే అరికట్టడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. గాలి నాణ్యతలో ఈ మెరుగుదల ప్రభుత్వ నిరంతర కృషి, అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఢిల్లీ నివాసితుల సమష్టి సహకారం వల్లే సాధ్యమైందని మంత్రి అన్నారు. స్వచ్ఛమైన గాలి కోసం సాగుతున్న ఈ ప్రచారానికి మద్దతిస్తున్న ఢిల్లీ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గాలి నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రయత్నాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని సంబంధిత శాఖలను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. జవాబుదారీతనం, సమర్థవంతమైన అమలు, ప్రజా భాగస్వామ్యంతో ఈ ప్రచారాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తామని సిర్సా పునరుద్ఘాటించారు. కాలుష్య నివారణ చర్యలను ముమ్మరం చేయడంలో భాగంగా, గత 24 గంటల్లో ప్రభుత్వం చేపట్టిన కీలక చర్యల వివరాలను కూడా వెల్లడించారు. వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు 9,883 వాహనాలకు చలాన్లు విధించారు. గుర్తించిన ప్రాంతాల నుంచి 12,702 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారు. రోడ్లపై దుమ్ము ధూళిని నియంత్రించేందుకు 1,075 కిలోమీటర్ల మేర నీటిని చల్లారు. 2,223 మెట్రిక్ టన్నుల నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తరలించడంతో పాటు, 2,810 కిలోమీటర్ల రోడ్లను మెకానికల్ స్వీపింగ్ ద్వారా శుభ్రం చేశారు.

# మీ పెట్టుబడులు రెట్టింపు చేయండి

-మొదటిపేజీ తరువాయి

శత్రువులు యుద్ధానికి దిగకుండా నిరోధించే శక్తి కూడా మనకు ఒక వ్యూహాత్మక ఆధిక్యాన్ని ఇస్తుంది. దేశ రక్షణ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఎదగాలి. మీ పెట్టుబడులకు నాది పూచీ. మీ పెట్టుబడులకు రెట్టింపు లాభాలు పొందేలా ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. లక్ష్యాన్ని సాధించడానికి నా నుంచి మీకు ఎలాంటి సహకారం కావాలో చెప్పండి. నేను చేస్తాను' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రక్ష ఎక్స్‌పో--2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి తాజ్ ఫలక్‌నుమాలో రక్షణ, వాయు, అంతరిక్ష పరికరాల ఉత్పత్తి సంస్థలకు చెందిన పారిశ్రామికవేత్తలు, రక్షణ రంగ ప్రముఖులకు ఇచ్చిన విందు సందర్భంగా రేవంత్ మాట్లాడారు.



**నైపుణ్య యువత తెలంగాణలో ఉంది...**

'భారత్‌లో హైదరాబాద్ ఒక వ్యూహాత్మకమైన ప్రదేశంగా కీలకమైన స్థానంలో ఉంది. హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం. అనేక ముఖ్యమైన పరిశోధనా సంస్థలకు నిలయం. భారత సైన్యం, వైమానిక దళాలకు సంబంధించిన అనేక ముఖ్యమైన వ్యూహాత్మక కేంద్రాలు ఇక్కడున్నాయి. దక్షిణ భారతదేశంలో సముద్రతీరం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ. అయినప్పటికీ, భారత నౌకాదళానికి రాష్ట్రం కీలకమైన సేవలు అందిస్తోంది. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో అత్యంత తక్కువ పౌనఃపున్యాల నౌకాదళ రాడార్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రక్షణ, వాయు, అంతరిక్ష రంగాల్లోని పరిశ్రమల్లో పనిచేయడానికి అత్యంత నిపుణులైన యువత అవసరం ఉందని, ఆ యువత తెలంగాణలో లభిస్తారని చెప్పారు.

అందుకోసం తాము స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి.. దానిని పారిశ్రామికవేత్త చేతిలో పెట్టామన్నారు. 'రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదు. రాజకీయంగా, సైద్ధాంతికంగా భిన్నాభిప్రాయాలున్నా.. పెట్టుబడులు, అభివృద్ధి విషయంలో మాకు ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. కీలక రంగాల్లో ఉన్న వారంతా పెద్ద పెద్ద లక్ష్యాలతో ఆలోచనలు చేయాలి. మన దగ్గర తెలివైన, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అవసరమైన వనరులున్నాయి. త్వరలోనే ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0ను విడుదల చేయబోతున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రం 2047 నాటికి మూడు ట్రిలియన్‌ల ఎకానమీగా మార్చడానికి మీ అందరి సహకారం అవసరమన్నారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో మిమ్మల్ని మళ్లీ కలుస్తా అని రేవంత్ అన్నారు.

**అంతర్జాతీయ అవకాశాలు: భట్టి**

పెట్టుబడులకు భరోసా, పరిశ్రమలకు నిరంతర విద్యుత్, వేగవంతమైన అనుమతులు, యువతకు నైపుణ్య శిక్షణతో పాటు స్థానిక సంస్థలకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో పెట్టుబడుల ఆకర్షణతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, చిన్న పరిశ్రమలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పారిశ్రామిక రంగానికి నమ్మకమైన విద్యుత్ సరఫరా, పటిష్టమైన ఆర్థిక ప్రణాళికలు, పారదర్శకమైన ప్రభుత్వ విధానాలు కీలకమని చెప్పారు.

**తెలంగాణ కీలక పాత్ర: మంత్రి ఉత్తమ్**

అంతర్జాతీయ ఏరోస్పేస్ సంస్థలు, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రత్యేక విడిభాగాల తయారీ పరిశ్రమలతో హైదరాబాద్‌లో బలమైన పారిశ్రామిక వ్యవస్థ ఏర్పడిందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. స్వదేశీ రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం, దేశీయ తయారీని విస్తరించడం, అంతర్జాతీయంగా పోటీపడగల పారిశ్రామిక సరఫరా వ్యవస్థలను నిర్మించడం వంటి భారతదేశ లక్ష్యాల సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

**కొత్త చాప్టర్ ప్రారంభం: శ్రీధర్‌బాబు**

రాష్ట్రంలో రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోని పరిశ్రమల కొత్త చాప్టర్ ప్రారంభంకాబోతోందని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్‌లో ఎప్పటి నుంచో రక్షణరంగానికి చెందిన పలు పరిశ్రమలను దూరదృష్టితో మన పూర్వీకులు ప్రారంభించారని చెప్పారు. తెలంగాణలో నైపుణ్య యువతకు కొదవ లేదని, అంతర్జాతీయ సంస్థలకు సరిపడా నిపుణులను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, స్కైరూట్ సీఈవో పవన్‌కుమార్, భారత్‌ఫోర్జ్ అధిపతి బాబా కల్యాణ్, రక్షణ రంగ నిపుణులు, భారత సాయుధ దళాల అధికారులు మాట్లాడారు. రక్షణ, ఏరోస్పేస్, అంతరిక్ష, అంతర్గత భద్రత రంగాలకు చెందిన 90కిపైగా దేశీయ, అంతర్జాతీయ కంపెనీల ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీటి వృథాకు పాల్పడితే రూ.5 వేల జరిమానా

హైదరాబాద్ నగరంలో తాగునీటి వృథాపై జలమండలి కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. జలమండలి ట్యాంకర్ల ద్వారా జరిగే నీటి వృథాపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎండీ అశోక్ రెడ్డి, వృథాను నివారించేందుకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటి వృథాకు పాల్పడితే నవంబర్ 1 నుంచి సంబంధిత ట్యాంకర్ యజమానికి రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదే ట్యాంకర్ రెండో సారి నిబంధనలు ఉల్లంఘిస్తే, రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. నీటి లీకేజీలు, మూతలు లేని ట్యాంకర్లను ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద ఉపయోగించవద్దని అధికారులను అశోక్ రెడ్డి ఆదేశించారు.

**బాధ్యతగా వ్యవహరించాలి**

ట్యాంకర్లపై మూతలు సరిగా లేకపోవడం వల్ల రవాణా సమయంలో నీరు రోడ్డుపై వృథాగా పోతున్నట్లు జలమండలి గుర్తించింది. ఈ నేపథ్యంలో ట్యాంకర్లలో నీటిని నింపడం, రవాణా సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు అమలు చేయాలని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు. ట్యాంకర్లలో నీటిని నింపే ముందు లీకేజీలు, మూతల పరిస్థితిని పరిశీలించాలని, లోపాలను గుర్తిస్తే వాటిని సరిచేసే వరకు నీటిని నింపరాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు.



**నీరు, విద్యుత్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు**

ఎల్‌నినో కారణంగా నీటి ఎద్దడి, తీవ్రమైన తాగునీటి కొరతను అధిగమించడం కోసం హైదరాబాద్ జలమండలి కఠినమైన నిర్ణయాలు తీసుకుంటోంది. జలమండలి పరిధిలోని అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ వినియోగాన్ని కనీసం 20% మేర తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి పొదుపును ప్రజా ఉద్యమంగా మార్చాలంటే, ముందుగా జలమండలి కార్యాలయాల్లోనే ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ మేరకు అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ పొదుపునకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జలమండలి కార్యాలయాల్లో ఎయిర్ కండిషనర్ల ఉష్ణోగ్రతను తప్పనిసరిగా 25 డిగ్రీల సెల్సియస్ వద్దే ఉంచాలని, సాయంత్రం 5 గంటల తర్వాత ఏసీల వినియోగాన్ని నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఏసీల నుంచి వెలువడే నీటిని వృథాగా పోనివ్వకుండా సేకరించి మొక్కల పెంపకం, శుభ్రత, తాగునీరు అవసరం లేని పనులకు పునర్వినియోగించాలని సూచించారు.

**పబ్‌కు రూ.20 వేల జరిమానా**

తాగునీటికి ఉపయోగించాల్సిన మంచినీటిని చాలా మంది ఇళ్ల ముందు రోడ్లు కడగడానికి, కార్లు, బైక్?లు వాష్ చేయడానికి వాడుతున్నారు. కమర్షియల్ పబ్‌లు, హోటళ్లలో ఇష్టానుసారంగా వృథా చేస్తున్నారు. ఈ కారణంగా ఇటీవల జూబ్లీహిల్స్? రోడ్? నంబర్?-45 లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌కు జలమండలి రూ.20 వేల జరిమానా విధించింది. నీటి దుర్వినియోగానికి పాల్పడిన ఆ పబ్‌కు తాగునీటి కనెక్షన్?ను తొలగించారు. కమర్షియల్ వాటర్ ట్యాంకర్ల సరఫరా కూడా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

**ఈ నంబర్లకు ఫిర్యాదు చేయాలి**

హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లలో నీటిని వృథా చేస్తే కనెక్షన్లు కట్ చేస్తామని జలమండలి అధికారులు హెచ్చరించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్క పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటి వృథాపై ఫొటోలు, వీడియోల ద్వారా 99499 30003 వాట్సాప్ నంబర్, 155313 కు ఫిర్యాదు చేయాలని కోరారు.

# హైదరాబాద్ చెరువులకు మహర్దశ

## పర్యాటక కేంద్రాలుగా తమ్మిడికుంట, సున్నం చెరువులు!

హైదరాబాద్ నగరంలోని చెరువులు ఆక్రమణల చెర నుంచి విముక్తి పొంది, పునరుజ్జీవం దిశగా అడుగులు వేస్తున్నాయి. నగరంలోని జలవనరులను పరిరక్షించడంతోపాటు వాటిని ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు హైడ్రా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే వందకుపైగా చెరువుల్లో ఆక్రమణలను తొలగించగా, తొలి రెండు దశల్లో 20 చెరువులను అభివృద్ధి చేస్తోంది. వీటిలో మూడు చెరువుల అభివృద్ధి పనులు పూర్తికావడంతో అవి ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా మాదాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువులు కూడా ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి.

**ప్రారంభోత్సవానికి సిద్ధమైన చెరువులు**

తమ్మిడికుంట, సున్నం చెరువుల అభివృద్ధి పనులను సైబరాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ జి.సృజన, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. చెరువుల కట్ట చుట్టూ తిరుగుతూ కాలిబాటలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, బోటింగ్ సదుపాయాలను తనిఖీ చేశారు. పనుల పురోగతిని సమీక్షించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ రెండు చెరువులను నెలాఖరున లేదా నవంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

**బెంగళూరు నమూనాలో అభివృద్ధి పనులు**

బెంగళూరు నమూనాను అనుసరిస్తూ హైదరాబాద్ నగర అవసరాలకు అనుగుణంగా హైడ్రా చెరువులను అభివృద్ధి చేస్తోంది. చెరువుల చుట్టూ విశాలమైన కట్టలు నిర్మించడంతోపాటు వాటి పొడవునా పూల మొక్కలు, కాలిబాటలు, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో నడక సాగించేందుకు వీలుగా పార్కులు, ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నారు. అలాగే చెరువుల్లోకి వరద నీరు చేరే ప్రాంతాల్లో పైపులైన్లు ఏర్పాటు చేసి, సెడిమెంటేషన్ ప్లాంట్ల ద్వారా నీటిలోని మట్టి, మలినాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.



**నీటి నిల్వ సామర్థ్యం పెంపుపై దృష్టి**

అంబర్‌పేట బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, బమ్‌రుఖ్‌నుద్దౌలా చెరువుల్లో ఈ విధానం మంచి ఫలితాలనిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉప్పల్ నల్ల చెరువులోనూ వరద నీరు చేరడంతో నీటి కళ సంతరించుకుంది. మరోవైపు చెరువుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. కొన్ని చెరువుల్లో మూడు నుంచి ఐదు మీటర్ల లోతు వరకు పూడికను తొలగిస్తున్నారు.

**హైటెక్‌సిటీ ప్రాంతానికి పర్యావరణ ఉపశమనం**

మాదాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువులు స్థానికంగా కీలకమైన జలవనరులు. వీటిలోని బోరుబావుల నుంచి హాస్టళ్లు, వాణిజ్య భవనాలకు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. అయితే ఆక్రమణల తొలగింపు అనంతరం నిర్వహించిన నీటి పరీక్షల్లో ప్రమాదకర స్థాయిలో భార లోహాలు ఉన్నట్లు తేలడంతో అధికారులు ఆయా బోరుబావులను మూసివేశారు. చెరువుల్లోని మురుగు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ రెండు చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడం ద్వారా స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడంతోపాటు నగర పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని హైడ్రా లక్ష్యంగా పెట్టుకుంది.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియ సుదీర్ఘకాలం నిలిచిపోయిందని తెలిపారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిన తర్వాత కూడా గతంలో ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబర్ 8వ తేదీన రవీంద్ర భారతిలో కార్యక్రమాన్ని నిర్వహించి భూమిని సొసైటీకి అప్పగించడం జరిగిందన్నారు. అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ అంశానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రి వెల్లడించారు.

**కాంగ్రెస్ పాలనలోనే ఇస్తాం**

"జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంద"ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు.

**జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం**

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరేలా, అందరికీ ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.

## కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్:

-మొదటిపేజీ తరువాయి

నిధుల విడుదలకు అవసరమైన పరిపాలనాపరమైన ప్రక్రియలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులతో నిరంతరం సమన్వయం సాధించడం ద్వారా నిధుల విడుదలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో తానే స్వయంగా చర్చిస్తానని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ట ప్రయోజనాలను పొందడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, దాన కిశోర్, రాహుల్ బొజ్జా, సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కష్టాలకు బీఆర్ఎస్ నేతలే కారణం

-మొదటిపేజీ తరువాయి

ఆయనకే అప్పగించాలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తప్పిదాలు, అవినీతితోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ. లక్ష కోట్లు ఖర్చయిందని.. మళ్లీ వారి వల్లే బరాజ్‌ల పునరుద్ధరణకు మరో రూ. 2--3 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందని తప్పుబట్టారు. మంత్రి గడ్డం వివేక్‌తో కలిసి శనివారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మరమ్మతులు పూర్తయ్యే వరకు మూడు బరాజ్‌ల గేట్లు ఎత్తిపెట్టాలని ఎన్డీఎస్ఏ కోరిందని.. దీంతో నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. మేడిగడ్డ బరాజ్‌కు 18--19 కి.మీ.ల దూరంలోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలంటే బరాజ్ గేట్లు దింపాల్సి ఉంటుందన్నారు. వర్షాల్లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే బీఆర్ఎస్ నేతలు సంతోషిస్తున్నారని విమర్శించారు. తప్పుడు ప్రచారంలో జోసెఫ్ గోబెల్స్‌ను ఎన్నోరెట్లు మించిపోయిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వారి పేర్ల ముందు గోబెల్స్ పేరు చేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచి?చన అప్పులు సరిగ్గా ఖర్చు చేసి ఉంటే తెలంగాణ రైతాంగానికి ఇంత నష్టం జరిగేది కాదని ఉత్తమ్ పేర్కొన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు ఉపయోగంలో లేకపోయినా గతేడాది దేశంలోనే అత్యధికం ధాన్యం పండించిన, సమీకరించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు.

**రైతుల కష్టాలకు బీఆర్ఎస్ నేతలే కారణం..**

తెలంగాణ రైతాంగ ఇబ్బందులకు కారకులైన వారే ఉల్టా చోర్ కోత్వాల్‌కు డాంటే తరహాలో రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత--చెవెళ్ల ప్రాజెక్టును యథాతథంగా పూర్తి చేసి ఉంటే ఎన్ని ఎల్‌నినోలు వచి?చనా ఉత్తర తెలంగాణ సస్యశామలంగా ఉండేదన్నారు. రూ. 38 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టును కమీషన్ల కక్కుర్తితో రీడిజైన్ చేసి రూ. 1.5 లక్షల కోట్లకు పెంచారని తప్పుబట్టారు. రూ. 38 వేల కోట్లతో ప్రాణహిత--చెవెళ్లను పూర్తి చేసి ఉంటే మిగిలిన నిధులతో పాలమూరు--రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, దేవాదుల, సీతారామ ప్రాజెక్టులు పూర్తయ్యేవన్నారు. ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టు మూలాన్ని తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మూలాన్ని జూరాల నుంచి శ్రీశైలానికి తరలించి కేసీఆర్ ఘోర తప్పిదానికి పాల్పడ్డారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని, నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసింది కేసీఆర్, ఇతరులేనని మంత్రి ఉత్తమ్ విమర్శించారు.

## హైదరాబాద్‌లో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ఔత్సాహిక ఎస్సీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు గచ్చిబౌలిలో ప్రత్యేకంగా కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అలాగే కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ లో సుమారు వేయి మందికి ఉపాధి కల్పించేలా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్(టీజీఎల్ఐపీసీ) ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధికి, ఆర్టిజన్లను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. అంతర్జాతీయ హంగులతో గచ్చిబౌలీలో హబ్ అండ్ స్పోక్ విధానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న సీఎఫ్‌సీ ద్వారా రాష్ట్రంలోని ఆర్టిజన్ల ఉత్పత్తులకు అదనపు విలువ(వాల్యూ యాడెడ్)ను జోడిస్తామన్నారు. డిజైనింగ్ మొదలు బ్రాండింగ్ వరకు వారికి మార్గనిర్దేశం చేస్తామన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట, ఆర్మూర్ లో మైక్రో స్మాల్ ఎంటర్ ప్రైజెస్ క్లస్టర్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్ఈసీడీపీ) కింద ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో లిడ్ క్యాప్ కు ఎక్కడెక్కడ భూములు కేటాయించారు... వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటనే అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదిక అందజేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, టీజీఎల్ఐపీసీ వీసీ అండ్ ఎండీ ప్రశాంత్ కుమార్, తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రెసిడెంట్ డా.ఆరేపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# అంతర్జాతీయ ఐటీ కంపెనీ భారీ ఆఫీస్ లీజు

### బంగారంతో గిన్నిస్ రికార్డులు!




బంగారు నగరంగా పేరొందిన దుబాయ్ ఖ్యాతికి మరో అరుదైన మైలురాయి చేరింది. జోయలుక్కస్ జ్యువెలరీ రూపొందించిన భారీ బంగారు ఝుమ్కాలు రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్నాయి. చేతితో తయారు చేసిన ఈ 22 క్యారెట్ల బంగారు చెవి కమ్మల జత మొత్తం బరువు 16.514 కిలోలు. ప్రపంచంలోనే అత్యంత బరువైన జత బంగారు చెవిపోగులుగా, అతిపెద్ద జత బంగారు చెవికమ్మలుగా వీటికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు లభించింది. 'మయూర సహస్ర' పేరుతో రూపొందించిన ఈ ఆభరణాల పేరుకు 'వెయ్యి నెమళ్లు' అని అర్థం. దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్‌లోని 'జ్యువెల్ ఆఫ్ జాయ్' వద్ద అక్టోబర్ 24న వీటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రి, ఆభరణాల పరిశ్రమకు చెందిన ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ భారీ ఝుమ్కాల తయారీకి నైపుణ్యం కలిగిన 55 మంది కళాకారులు శ్రమించారు. అనేక నెలలపాటు మొత్తం 5,840 గంటలు వెచ్చించి వీటిని రూపొందించారు. ఒక్కో చెవిపోగు 1.215 మీటర్ల పొడవు, 0.682 మీటర్ల వ్యాసంతో ఉండటం విశేషం. సంప్రదాయ నగల తయారీ నైపుణ్యానికి ఆధునిక సృజనాత్మకతను జోడించి రూపొందించిన ఈ ఆభరణాలు, అంతర్జాతీయ బంగారు నగల మార్కెట్‌లో దుబాయ్ ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పాయి.

నేడు భారత్‌లో బంగారం ధరలు

శనివారం (అక్టోబర్ 24) భారత మార్కెట్లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.100 పెరుగుదలతో రూ.1,30,700 వద్దకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల ధర కూడా రూ.100 పెరిగి రూ.1,42,580లను తాకింది. దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో.. ఈ కింద చూడవచ్చు.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా ఫారిన్ కరెన్సీ పట్టివేత



హైదరాబాద్ నగర శివారులోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తనిఖీలను ఎంత కట్టుదిట్టం చేసినా బంగారం స్మగ్లింగ్ విదేశీ కరెన్సీ అక్రమరవాణా యథేచ్ఛగా జరుగుతూనే ఉంది. నిత్యం ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ అధికారులకు స్మగ్లర్‌లు పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా ఇద్దరు ప్రయాణికుల నుంచి భారీగా ఫారిన్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఉదయం ఇద్దరు ప్రయాణికులు కౌలాలంపూర్ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. అయితే వారి నడవడిక తేడాగా అనిపించడంతో అనుమానించిన డీఆర్ఐ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారి దగ్గర భారీగా విదేశీ కరెన్సీ లభ్యమైంది. పట్టుబడ్డ నగదు విలువ దాదాపుగా రూ.1.56 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. ఇద్దరు నిందితులు ఎయిర్‌ఏషియా ఏకే-68 విమానంలో వెళ్లేందుకు వచ్చి పట్టుబడ్డారు. పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేశారు.




అంతర్జాతీయ టెక్నాలజీ సంస్థ ఐబీఎం భారత్‌లో తన కార్యాలయ విస్తరణను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా బెంగళూరులో 2.83 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని పదేళ్ల కాలానికి లీజుకు తీసుకుంది. ఈ ఒప్పందంలో సాధారణ అద్దెతో పాటు కార్యాలయాన్ని వినియోగానికి అనుగుణంగా సిద్ధం చేసేందుకు చెల్లించే ఫిట్-అవుట్ అద్దెను కలిపితే మొత్తం వ్యయం సుమారు రూ.522 కోట్లకు చేరనుంది. కమర్షియల్ రియల్ ఎస్టేట్ ఏజెన్సీ ప్రాప్‌స్టాక్‌కు లభించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పత్రాల్లో ఈ లావాదేవీ వివరాలు వెల్లడయ్యాయి. బెంగళూరులోని బాగ్మానే సోలేరియం సిటీ ఐటీ పార్కులో ఉన్న రాడాన్ టవర్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి, రెండో, మూడో అంతస్తులను ఐబీఎం లీజుకు తీసుకుంది. ఈ స్థలానికి చదరపు అడుగుకు నెలకు రూ.88 చొప్పున అద్దె చెల్లించనుంది. దీంతో నెలవారీ అద్దె సుమారు రూ.2.49 కోట్లుగా ఉంటుంది. ప్రతి మూడేళ్లకు అద్దెను 15 శాతం పెంచేలా ఒప్పందం కుదిరింది. భవన యజమాని ఆకృతి ఇన్‌ఫ్రా-బిల్డ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఐబీఎం రూ.14.96 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించింది.

**ఫిట్-అవుట్ ఖర్చులే రూ.179 కోట్లు**

కార్యాలయ స్థలానికి చెల్లించే సాధారణ అద్దెకు అదనంగా, అంతర్గత ఏర్పాట్లు, కార్యాలయ మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫిట్-అవుట్ అద్దె కూడా ఈ ఒప్పందంలో భాగంగా ఉంది. ఇందుకోసం ఐబీఎం నెలకు సుమారు రూ.2.98 కోట్లు చెల్లించనుంది. ఈ చెల్లింపులు మార్చి 2031 వరకు ఐదేళ్లపాటు కొనసాగనున్నాయి. ఈ కాలానికి ఫిట్-అవుట్ అద్దె వ్యయం దాదాపు రూ.179 కోట్లుగా అంచనా వేశారు. ఈ లీజు కాలం 2026 ఫిబ్రవరి 5న ప్రారంభమైనట్లు పత్రాలు సూచిస్తున్నాయి. ఒప్పంద పత్రాలపై మే 29, 2026న సంతకాలు చేయగా, అక్టోబర్ 1న రిజిస్ట్రేషన్ పూర్తయింది. బెంగళూరు ఒప్పందానికి ముందు, 2026 జనవరిలో ఐబీఎం గురుగ్రామ్‌లో 2.30 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని పదేళ్లకు లీజుకు తీసుకుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతంలోనూ ఐబీఎంకు కార్యాలయ కార్యకలాపాలు ఉన్నాయి. 2024లో దివ్యశ్రీ ఓరియన్ క్యాంపస్‌లో రెండు అంతస్తుల్లో విస్తరించిన 1.06 లక్షల చదరపు అడుగుల స్థలానికి రియల్ ఎస్టేట్ సంస్థ మిడాస్ ప్రాజెక్ట్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ 26 ఎకరాల క్యాంపస్‌లోని స్థలానికి చదరపు అడుగుకు నెలకు రూ.66 చొప్పున అద్దె నిర్ణయించినట్లు అప్పటి ఆస్తి రిజిస్ట్రేషన్ వివరాలు వెల్లడించాయి.

## ఈ చిన్న రైలు సంపాదన.. 21 రోజుల్లో రూ.1.41 కోట్లు!



పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే (డీహెచ్‌ఆర్) హెరిటేజ్ టాయ్ ట్రైన్ ప్రయాణాలకు పర్యాటకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. అక్టోబర్ 1 నుంచి 21వ తేదీ వరకు కేవలం 21 రోజుల్లోనే ఈ రైల్వే నిర్వహించిన జాయ్ రైడ్స్‌లో సుమారు 12,000 మంది ప్రయాణించారు. ఈ సేవల ద్వారా రూ.1.41 కోట్ల ఆదాయం వచ్చినట్లు రైల్వే అధికారి వెల్లడించారు. డార్జిలింగ్ కొండల అందాలను ఆస్వాదించడంతో పాటు, చారిత్రక రైలులో ప్రయాణించాలనుకునే పర్యాటకులు ఈ ప్రత్యేక సేవలపై ఆసక్తి చూపుతున్నారు. పర్యాటకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని డీహెచ్‌ఆర్ అక్టోబర్ 1 నుంచి అదనపు జాయ్ రైడ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. డార్జిలింగ్--ఘుమ్ మధ్య ప్రత్యేక రైళ్లతో పాటు, కుర్సియాంగ్--మహానది మధ్య రెండు రౌండ్ ట్రిప్పులను నిర్వహిస్తోంది. ఈ సేవల్లో ఒక రౌండ్ ట్రిప్‌ను ఆవిరి ఇంజిన్‌తో, మరొకదాన్ని డీజిల్ ఇంజిన్‌తో నడుపుతున్నారు. దీంతో పర్యాటకులు రైల్వే వారసత్వాన్ని విభిన్న అనుభూతులతో ఆస్వాదించే అవకాశం లభిస్తోంది. ప్రస్తుతం పండుగల సీజన్ నేపథ్యంలో డీహెచ్‌ఆర్ మొత్తం 15 జాయ్ రైడ్ సర్వీసులను నిర్వహిస్తోంది. వీటిలో 11 సేవలు డార్జిలింగ్--ఘుమ్--డార్జిలింగ్ మార్గంలో నడుస్తుండగా, మిగిలిన సేవలను ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి నిర్వహిస్తున్నట్లు సమాచారం. న్యూ జల్పాయిగురి--డార్జిలింగ్ మధ్య సాధారణ రైలు సేవలు కూడా కొనసాగుతున్నాయి. 1881లో ప్రారంభమైన డార్జిలింగ్ హిమాలయన్ రైల్వేకు 1999లో యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా లభించింది. సుమారు 88 కిలోమీటర్ల పొడవైన ఈ ఇరుకుగేజ్ రైల్వే మార్గం, ఎత్తైన కొండ ప్రాంతాల్లో రైళ్లను నడిపేందుకు రూపొందించిన ప్రత్యేక ఇంజినీరింగ్ నిర్మాణానికి ప్రసిద్ధి చెందింది. ఘుమ్ స్టేషన్ సముద్ర మట్టానికి సుమారు 2,258 మీటర్ల ఎత్తులో ఉంది. కొండల మధ్య మెలికలు తిరిగే పట్టాలు, టీ తోటలు, ప్రకృతి దృశ్యాల మధ్య సాగే ప్రయాణం ఈ టాయ్ ట్రైన్‌ను పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుపుతోంది.

---

# భారత్‌కు విజయ 'తిలకం'..

## రెండో టీ20లోనూ టీమిండియా అద్భుత విజయం

**న్యూజిలాండ్ 20 ఓవర్లలో 180/5 స్కోరు**

**గ్లెన్ ఫిలిప్స్ 70, బెవాన్ జాకబ్స్ 58 పరుగులు**

**అర్ష్‌దీప్ సింగ్ ఖాతాలో రెండు వికెట్లు**

**లక్ష్య ఛేదనలో భారత టాప్ ఆర్డర్ తడబాటు**

**చివరి ఓవర్లలో అద్భుతం చేసిన తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి**




టీమిండియాకు ఓటమి తప్పదనుకున్న వేళ తెలుగు కుర్రాళ్లు అదరగొట్టారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డితో కలిసి భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతం చేశాడు. చివరి ఓవర్లలో మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పి న్యూజిలాండ్‌పై టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా శనివారం జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు మధ్యలో తడబడినా.. తిలక్, నితీశ్ పోరాటంతో విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. ఆరంభంలో భారత బౌలర్లు పైచేయి సాధించారు. టిమ్ సీఫెర్ట్ (7), డారిల్ మిచెల్ (6), ఫిన్ అలెన్ (16) త్వరగా వెనుదిరిగారు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా.. ప్రిన్స్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. అయితే గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఫిలిప్స్ 43 బంతుల్లో 70 పరుగులు చేయగా, జాకబ్స్ 46 బంతుల్లో 58 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 116 పరుగులు జోడించి న్యూజిలాండ్‌ను పటిష్ఠ స్థితికి చేర్చారు. చివర్లో మైకేల్ బ్రేస్‌వెల్ రెండు బంతుల్లోనే 10 పరుగులు చేయడంతో ఆతిథ్య జట్టు 180 పరుగుల స్కోరు సాధించింది. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (14), వైభవ్ సూర్యవంశీ (4) త్వరగా ఔటయ్యారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (7) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. దీంతో భారత్ పరుగుల కోసం ఇబ్బంది పడింది. కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ న్యూజిలాండ్ చేతుల్లోకి వెళ్లినట్లు కనిపించింది. ఆ సమయంలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి (26 నాటౌట్) బాధ్యత తీసుకున్నారు. తిలక్ (51 నాటౌట్: 6 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలిలో బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించగా, నితీశ్ భారీ షాట్లతో అతడికి అండగా నిలిచాడు. చివరి ఓవర్లలో వీరిద్దరి దూకుడుతో భారత్ విజయానికి చేరువైంది. చివరి ఓవర్‌కు ముందు 10 పరుగులు అవసరమైన దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా ఆడిన ఈ జోడీ లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 2-0 ఆధిక్యాన్ని అందుకుంది. తొలి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా, రెండో మ్యాచ్‌లోనూ ఒత్తిడిని తట్టుకుని గెలవడం విశేషం. కీలక సమయంలో తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ చూపిన పోరాటం, నితీశ్ రెడ్డి ఇచ్చిన సహకారం భారత విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి.



## స్పోర్ట్స్

### పాకిస్తాన్ జట్టు ప్రకటన.. ముగ్గురు 'మొనగాళ్ల'కు పిలుపు




శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం 14 మంది సభ్యులతో కూడిన తమ జట్టును పాకిస్తాన్ క్రికెట్ బోర్డు శనివారం ప్రకటించింది. ఈ జట్టుకు స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం నాయకత్వం వహించనున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టెస్టుకు దూరమైన ఆల్‌రౌండర్ సల్మాన్ అలీ ఆఘా తిరిగి జట్టులోకి వచ్చాడు. ప్రస్తుతం సొంతగడ్డపై జరుగుతున్న వన్డే ట్రై-సిరీస్‌లో సల్మాన్ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. శ్రీలంకతో జరిగిన తొలి మ్యాచ్‌లో అతడు 90 బంతుల్లోనే 107 పరుగులు సాధించి మంచి ఊపులో ఉన్నాడు. ఈ క్రమంలోనే అతడిని తిరిగి జట్టులోకి తీసుకున్నారు.

**కొత్త ఆటగాళ్లకు పిలుపు**

కాగా ముగ్గురు యువ బ్యాటర్లకు తొలిసారిగా జాతీయ జట్టులో చోటు దక్కింది. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ మహ్మద్ తహా, రైట్ హ్యాండ్ బ్యాటర్లు సమీర్ మిన్హాస్, మహ్మద్ సులేమాన్‌లను లంకతో సిరీస్‌కు ఎంపిక చేశారు. అబ్దుల్లా ఫజల్, అరాఫత్ మిన్హాస్, అవైస్, మహ్మద్ అబ్బాస్, రజాఉల్లా, సాద్ బైగ్, సౌద్ షకీల్ తదితరులు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. వికెట్ కీపర్లుగా మహ్మద్ గాజీ ఘోరి, సాద్ బైగ్ ఎంపికవగా.. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అలీ ఉస్మాన్ కూడా జట్టులో చోటు దక్కించుకున్నారు. మరోసారి సీనియర్ ప్లేయర్ షాహీన్ షా అఫ్రిదికి టెస్టు జట్టులో చోటు దక్కలేదు. అదేవిధంగా మాజీ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌ను సైతం పక్కన పెట్టారు. నవంబర్ 9 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది.

**శ్రీలంకతో సిరీస్‌కు పాక్ జట్టు ఇదే**

బాబర్ ఆజమ్ (కెప్టెన్), అబ్దుల్లా ఫజల్, అలీ ఉస్మాన్, అరాఫత్ మిన్హాస్, అజాన్ అవైస్, మహ్మద్ అబ్బాస్, మహ్మద్ గాజీ ఘోరి (వికెట్ కీపర్), మహ్మద్ సులేమాన్, మహ్మద్ తహా, రజాఉల్లా, సాద్ బైగ్ (వికెట్ కీపర్), సల్మాన్ అలీ ఆఘా, సమీర్ మిన్హాస్, సౌద్ షకీల్.




# అడవి నేపథ్యంలో 'సింగ'

హీరో గోపీచంద్ మరోసారి తనదైన మాస్ అవతారంలో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సింగ' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ చిత్రం ద్వారా యాక్షన్ కొరియోగ్రాఫర్ వి.వెంకట్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. మలయాళ నటి అనార్కలి నాజర్ కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమా షూటింగ్ యాభైశాతం పూర్తయింది. ఈ సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో గోపీచంద్ చేతిలో భారీ ఆయుధాన్ని ధరించి శక్తివంతంగా కనిపిస్తున్నారు. అడవి నేపథ్యంలో నడిచే కథాంశమిదని, ప్రత్యేకంగా నిర్మించిన ఫారెస్ట్ సెట్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కించామని, డిసెంబర్‌లో తదుపరి షెడ్యూల్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఇంటెన్స్ యాక్షన్, ఎమోషన్స్ కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, గోపీచంద్ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: సామ్ సీఎస్, రచన-దర్శకత్వం: వి.వెంకట్.

# కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టా!

ఇటీవలే 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది అస్సామీ సొగసరి కయాదు లోహర్. ప్రస్తుతం ఈ భామ దక్షిణాదిన భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అందులో మారి సెల్వరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న తమిళ చిత్రం 'మంజనాతి' ఒకటి. మహిళా ప్రధాన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా తనను వ్యక్తిగతంగా ఎంతో ప్రభావితం చేసిందని కయాదు లోహర్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా ఆనందం వ్యక్తం చేసింది. దర్శకుడు మారి సెల్వరాజ్‌తో కలిసి ఖాళీ రహదారిపై నడుస్తున్న ఫొటోను షేర్ చేసింది. 'నటిగా నేను విభిన్నమైన ప్రపంచంలోకి అడుగుపెట్టా. ఇదొక కొత్త పాఠశాల. నా వ్యక్తిత్వానికి ఎంతో దగ్గరైన పాత్ర ఇది. ఈ ప్రయాణంలో భాగం కావడం సంతోషంగా ఉంది' అని కయాదు లోహర్ తన పోస్ట్‌లో పేర్కొన్నది. ఈ చిత్రంలో మరో నాయికగా ప్రియాంక మోహన్ నటిస్తున్నది. ఇళయరాజా సంగీతాన్నందిస్తున్నారు.





# మన బట్టలు, మన ఇష్టం.. కామెంట్ చేసే హక్కు వాళ్లకు ఎవరిచ్చారు?: కృతి సనన్ ఫైర్!

బాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న ట్రోలింగ్ మరియు లింగ వివక్షపై ప్రముఖ నటి కృతి సనన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కరీనా కపూర్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' షోలో పాల్గొన్న ఆమె, తన దుస్తులపై జరిగిన అనవసర రాద్ధాంతం గురించి ఓపెన్‌గా మాట్లాడారు. ఇటీవల ఒక ప్రకటనలో తాను ధరించిన డ్రెస్ జాతీయ స్థాయిలో చర్చనీయాంశం కావడం, ఏకంగా ప్రైమ్‌టైమ్ న్యూస్ డిబేట్లు జరగడం తనను తీవ్రంగా షాక్‌కు గురిచేసిందని కృతి తెలిపారు. సాధారణంగా ఇలాంటి విమర్శలను తాను పట్టించుకోనప్పటికీ, మహిళలను చిన్న విషయాలకే టార్గెట్ చేయడం పెరిగిపోవడంతో స్పందించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మహిళలు ఎలాంటి దుస్తులు ధరించాలనేది పూర్తిగా వారి వ్యక్తిగత స్వేచ్ఛ అని, ఇతరులకు ఆ హక్కు ఎవరిచ్చారని కృతి నిలదీశారు. లావుగా ఉన్నా, సన్నగా ఉన్నా, కాస్త బరువు పెరిగినా బాడీ షేమింగ్ చేయడం, అనవసరమైన కామెంట్లు విసరడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా నెగెటివిటీని తట్టుకోలేక కామెంట్ సెక్షన్ ఆఫ్ చేసేయమని సోదరి సలహా ఇచ్చినా, ఎవరికీ భయపడి తాను వెనక్కి తగ్గేది లేదని తేల్చిచెప్పారు. కృతి ధైర్యవంతమైన వ్యాపార వైఖరిని కరీనా కపూర్ ఖాన్ పూర్తిగా సమర్థించారు. చిన్నపాటి శారీరక మార్పులకు కూడా జనం ముందు వివరణ ఇచ్చుకోవాల్సిన దుస్థితి నేడు నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తూ, కృతి స్పందించిన తీరు ఎంతో అభినందనీయమని ప్రశంసించారు.



# స్త్రీ సామ్రాజ్య నాయకి

అధికారం, వారసత్వం, ప్రతీకారం నేపథ్యంతో సాగే గ్యాంగ్‌స్టర్ కథాంశంతో రూపొందిన వెబ్‌సిరీస్ 'అక్క'. ఇందులో మాతృస్వామ్య సామ్రాజ్యానికి నాయకత్వం వహించే 'భవానీ అక్క'గా కీర్తి సురేశ్ నటించారు. రాధికా ఆప్టే కీలకపాత్రధారి. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ వెబ్‌సిరీస్‌కు ధర్మరాజ్‌శెట్టి దర్శకుడు. ఈ నెల 30న నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానున్నది. ఈ సందర్భంగా ఈ సిరీస్ ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. తరతరాలుగా మహిళలే ముందుండి నడిపిస్తూ, తమ అధికారాన్ని, ఆధిపత్యాన్ని కాపాడుకుంటున్న పేర్రూరు అనే రాజ్యంలో జరిగే ఆసక్తికరమైన అంశాల చుట్టూ ఈ సిరీస్ నడుస్తుందని ట్రైలర్ చెబుతున్నది. వారసత్వానికీ, ఆధిపత్యానికీ మధ్య పోరాటంగా ఈ సిరీస్ సాగుతుందని, ఇద్దరు శక్తివంతమైన మహిళల మధ్య సాగే పోరాటమే ఈ సిరీస్ అని మేకర్స్ తెలిపారు. వారసత్వాన్ని కాపాడుకునేందుకు ఎంతదూరమైన వెళ్లే వ్యక్తిగా ఇందులో కనిపిస్తానని, ఇది సవాళ్లతో కూడుకున్న పాత్ర అని, కథ సాగే కొద్దీ తన పాత్రలో విభిన్న కోణాలు చూస్తారని కీర్తి సురేశ్ తెలిపారు. తన్వీ ఆజ్మీ, మహేశ్ మంజ్రేకర్, అన్షుమన్ పుష్కర్, మోనికా పన్వార్ ఇందులో ఇతర పాత్రధారులు.

# పాకిస్థాన్ ఏజెంట్ ఇండియా వస్తే..

## 'ఉడ్తా తీర్' రివ్యూ!

నటీనటులు: ఆయుష్మాన్ ఖురానా, సారా అలీఖాన్, ముకుల్ దేవ్, గుల్షన్ గ్రోవర్, రామ్ కపూర్, రాహుల్ బోస్, బ్రిజేంద్ర కాల్ తదితరులు
దర్శకత్వం, రచన: ఆకాశ్ కౌశిక్
నిర్మాతలు: కరణ్ జోహార్, అదార్ పూనావాలా, గునీత్ మోంగా, అపూర్వ మెహతా, అచిన్ జైన్
విడుదల తేదీ: 23-10-2026
జానర్: స్పై యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్

**కథ**

భారత యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్‌లో విక్రాంత్ (ఆయుష్మాన్ ఖురానా) ఒక కీలకమైన ఏజెంట్. ఉగ్రవాది మసూద్ అజార్ (ముకుల్ దేవ్) దేశంలో అలజడి సృష్టించేందుకు వేసిన పన్నాగాన్ని విక్రాంత్ అడ్డుకుంటాడు. అయితే మసూద్‌ను పట్టుకునే ప్రయత్నంలో విక్రాంత్ సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లోకి అడుగుపెడతాడు. అక్కడ ఊహించని విధంగా పాక్ ఆర్మీ అతడిని తమ అత్యంత నమ్మకస్థుడైన ఏజెంట్ 'బిలాల్ అహ్మద్'గా ప్రకటిస్తుంది. తిరిగి భారతదేశానికి వచ్చాక విక్రాంత్ ప్రవర్తనపై ఏటీఎస్ చీఫ్ ఆర్డీ బర్మన్ (రాహుల్ బోస్)కు అనుమానం కలుగుతుంది. సరిగ్గా అదే సమయంలో జరిగిన ఒక కారు ప్రమాదంలో విక్రాంత్ తలకు బలమైన గాయమై తన గతం పూర్తిగా మరచిపోతాడు. పాకిస్థాన్ పన్నిన కుట్ర ఏంటి? గతం మరిచిన ఆ ఏజెంట్ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడు? చివరకు ఏం జరిగిందనేదే ఈ చిత్ర కథ.

**విశ్లేషణ**

ఇటీవల కాలంలో వచ్చిన స్పై థ్రిల్లర్లకు పూర్తి భిన్నంగా, సరికొత్త కామెడీ జోనర్‌లో దర్శకుడు ఆకాశ్ కౌశిక్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. లాజిక్‌ల గురించి ఎక్కువగా ఆలోచించకుండా చూస్తే, ఈ సినిమా మొదటి నుంచి చివరి వరకు చక్కటి వినోదాన్ని పంచుతుంది. సినిమా ప్రారంభం నుంచే కామెడీ డోస్ మాములుగా ఉండదు. విక్రాంత్ పాక్ ఏజెంట్‌గా మారడం, ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో గతం మరచిపోవడం వంటి సన్నివేశాలు థియేటర్లలో నవ్వులు పూయిస్తాయి. ముఖ్యంగా ఆసుపత్రి ఎపిసోడ్ మరియు పాక్ ఏజెంట్ల గందరగోళం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయి. సెకండాఫ్‌లో వినోదం మోతాదు కొద్దిగా తగ్గి, కథ సీరియస్ టర్న్ తీసుకుంటుంది. హీరోకి గతం గుర్తుచేయడానికి జరిగే ప్రయత్నాలు కొన్ని చోట్ల ఫస్ట్ హాఫ్ సీన్లను రిపీట్ చేసిన భావన కలిగిస్తాయి. హీరో, భార్య యమున (సారా అలీఖాన్) మధ్య వచ్చే లవ్ ట్రాక్ కొద్దిగా సాగదీసినట్లు అనిపిస్తుంది. ప్రీ-క్లైమాక్స్‌లో వచ్చే ఊహించని ట్విస్ట్ కథకు మంచి ముగింపునిస్తుంది. దర్శకుడు ఈ సినిమాను ఒక సీరియస్ యాక్షన్ డ్రామాగా కాకుండా పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా మలచడంలో సఫలమయ్యారు.

నటీనటులు

గతం మరిచిన ఏజెంట్‌గా ఆయుష్మాన్ ఖురానా తన అద్భుతమైన టైమింగ్‌తో సినిమాను తన భుజాలపై మోశారు. నవ్వులు పంచుతూనే యాక్షన్ సీన్లలోనూ ఆకట్టుకున్నారు. ఉగ్రవాది పాత్రలో ముకుల్ దేవ్ నవ్వులు పూయించారు. రాహుల్ బోస్, సారా అలీఖాన్ తమ పరిధి మేరకు చక్కటి నటన కనబరిచారు.

ప్లస్ పాయింట్లు
విపరీతమైన హాస్యం, కామెడీ టైమింగ్
ఆయుష్మాన్ ఖురానా అభినయం
ఆసక్తికరమైన ప్రథమార్ధం మరియు క్లైమాక్స్ ట్విస్ట్

మైనస్ పాయింట్లు
ద్వితీయార్ధంలో పునరావృతమైన కొన్ని సన్నివేశాలు
అక్కడక్కడా నెమ్మదించిన కథనం

చివరిగా మంచి వినోదాన్ని కోరుకునే ప్రేక్షకులకు 'ఉడ్తా తీర్' ఒక చక్కటి చాయిస్. లాజిక్‌లను పక్కన పెట్టి చూస్తే, ఈ వీకెండ్‌లో ఫ్యామిలీతో కలిసి హాయిగా నవ్వుకోవచ్చు!




printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512